నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 15-9-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక:36 పేజీలు: 4 వెల: రూ.1/-

భూమి ఉన్నపేదలకు అండగా కొత్త రెవెన్యూ చట్టం

తెలంగాణలో భూస్వాములు లేనేలేరు
రెవెన్యూ బిల్లువల్ల భూస్వాములకు లాభం
అనుభవదారు కాలమ్ ఎత్తేసామని వెల్లడి
ప్రభుత్వం వద్ద పక్కాగా భూముల వివరాలు
అన్యాయంగా ఏడు మండలాలను ఎపిలో కలిపారు
అసెంబ్లీలో రెవెన్యూ బిల్లు ప్రవేశ పెట్టిన సిఎం కెసిఆర్

హైదరాబాద్,సెప్టెంబర్14(ఆర్ఎన్ఎ): భూమిని నమ్ముకుని బతుకుతున్న పేదలకు అండగా నిలవాలన్న లక్ష్యంతోనే కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకుని వచ్చామని సిఎం కెసిఆర్ పునరుద్ఘాటించారు. తెలంగాణ రాష్ట్రంలో భూస్వాములు, జాగీర్దార్లు, జమీందార్లు లేరని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. శాసనమండలిలో నూతన రెవెన్యూ బిల్లును ప్రవేశపెట్టిన సందర్భంగా సీఎం మాట్లాడారు. కొంతమంది నాయకులు బయట అవాకులు చెవాకులు పేలుతున్నారు. ఈ బిల్లు వల్ల భూస్వాములకు లాభం జరుగుతుందని అంటున్నారు. కానీ తెలంగాణలో భూస్వాములు, జాగీర్దార్లు, జమీందార్లు లేరని సీఎం తేల్చిచెప్పారు. ఇది కఠోర సత్యమని అని సీఎం అన్నారు. తెలంగాణలో ఉన్నదంతా మూడెకరాల లోపు ఆసాములేనని అన్నారు. వారికి రోణగా నిలవాల్సిన బాధ్యత ఉందన్నారు. అందుకే భూముల్లో అనుభవదారు కాలమ్ ఎత్తేశామని, దానితో ప్రభుత్వానికి సంబంధం లేదన్నారు. ఇకపోతే అందరూ ఆందోళన చెందుతున్నట్లుగా రాష్ట్రంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అవినీతికి ఆస్కారమే లేదని సీఎం కేసీఆర్ తేల్చిచెప్పారు. గత ప్రభుత్వాలు వీఆర్వోలకు అనవసర అధికారాలు ఇవ్వడంతో అరాచకాలకు పాల్పడ్డారని సీఎం గుర్తు చేశారు. ఈ క్రమంలో వీఆర్వోలను రద్దు చేసి కఠిన నిర్ణయాలను తీసుకున్నామని తెలిపారు. ధరణి పోర్టల్ ద్వారా ఇకపై తహసీల్దార్లు కూడా అవినీతికి పాల్పడే అవకాశమే లేదన్నారు. ధరణి పోర్టల్‌లో మార్పులకు తహసీల్దార్‌కు అవకాశం లేదన్నారు. సబ్ రిజిస్ట్రార్లకు ఎలాంటి విచక్షణా అధికారం లేదన్నారు. పది నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్లు పూర్తయ్యేలా ఏర్పాట్లు చేస్తామని కేసీఆర్ పేర్కొన్నారు. ధరణి పోర్టల్‌లో అప్‌డేట్ కాగానే సంబంధిత కాపీలు వస్తాయన్నారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, అప్‌డేషన్ కాపీలు వెంటనే వస్తాయన్నారు. బయోమెట్రిక్, ఐరిస్, ఆధార్, ఫోటోతో రిజిస్ట్రేషన్లు చేస్తామన్నారు. ఈ వివరాలన్నీ లేకుండా తహసీల్దార్లకు పోర్టల్ తెరుచుకోదన్నారు. పకడ్బంది వ్యూహంతో పేద రైతుల హక్కులు కాపాడుతామన్నారు. రైతులు, ప్రజలకు లంచాలు ఇచ్చే బాధ తప్పాలనేది ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. రెవెన్యూ కోర్టులు రద్దు చేశామని తెలిపారు. వివాదాల పరిష్కారానికి కోర్టుకు వెళ్లవచ్చు అని సూచించారు. కావాలని వివాదాలకు వెళ్లే వారి విషయంలో ప్రభుత్వం సమయం వృథా చేయదు అని సీఎం స్పష్టం చేశారు.రాష్ట్రంలో మొత్తం 60,95,134 మంది పట్టాదారులు ఉన్నారని చెప్పారు. 2.5 ఎకరాల భూమి ఉన్న రైతులు 39,52,232 మంది ఉన్నారని తెలిపారు. 2.5 నుంచి 3 ఎకరాల్లోపు ఉన్న రైతులు 4,70,759 మంది, 3 నుంచి 5 ఎకరాల్లోపు ఉన్న రైతులు 11,08,193 మంది, 5 నుంచి 7.5 ఎకరాల్లోపు ఉన్న రైతులు 3,49,382 మంది, 7.5 నుంచి 10 ఎకరాల్లోపు ఉన్న రైతులు 1,15,916 మంది, 25 వేల ఎకరాల్లోపు ఉన్న రైతులు 6 వేల మంది ఉన్నారని సీఎం తెలిపారు. భూమి ప్రధాన ఉత్పత్తి సాధనంగా మారగానే మనిషి జీవనశైలి దానిచుట్టే తిరిగిందని చెప్పారు. అసఫ్‌జాహీల పాలనా కాలంలో ముగ్గురు సాలార్‌జంగ్‌లు సంస్కరణలు చేశారని తెలిపారు. మొదటి సాలార్‌జంగ్ కాలంలో అనేక రెవెన్యూ సంస్కరణలు వచ్చాయని చెప్పారు. హైదరాబాద్ రాష్ట్ర సంస్కృతి, జీవనశైలి విభిన్నంగా ఉండేవన్నారు. 1985లో పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దయిందన్నారు. 2007లో వీఆర్వో వ్యవస్థ రూపుదిద్దుకున్నదని చెప్పారు. తెలంగాణ ఏర్పడితే భూముల విలువ పడిపోతుందని నాటి సమైక్య పాలకులు బాకాలు ఊదినవారు శాపాలు పెట్టారని విమర్శించారు. ఇవాళ రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఎకరం భూమి కనీసం రూ.10 లక్షలకు తక్కువలేదని చెప్పారు. అలాగే ప్రధాన ప్రాంతాల్లో కోటి వరకు కూడా ఉందన్నారు. ఈ బిల్లు వల్ల రైతులకు, నిరుపేద వర్గాలకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ వచ్చాక భూమి ధర పడిపోతుందని సమైక్యవాదులు ప్రచారం చేశారని, అయితే ప్రస్తుతం ఎకరం ధర పది లక్షలకు తక్కువగా పలకడం లేదని ఆయన పేర్కొన్నారు. భూమి ఉత్పత్తి సాధనంగా మారిన తర్వాత మానవ జీవన శైలి దాని చుట్టే తిరిగిందని ఆయన చెప్పారు. అసఫ్‌జాహీల పాలనా కాలంలో ముగ్గురు సాలార్‌జంగ్‌లు భూ సంస్కరణలు చేశారని కెసిఆర్ తెలిపారు. మొదటి

సాలార్‌జంగ్ కాలంలో పలు రెవెన్యూ సంస్కరణలు జరిగాయని ఆయన వెల్లడించారు. 1985లో పటేల్, పట్వారీ వ్యవస్థ రద్దు అయిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అయితే 2007లో విఆర్ఓ వ్యవస్థ వచ్చిందని, విఆర్ఓ వ్యవస్థ అరాచకంగా వ్యవహరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుండడంతో తాము ఆ వ్యవస్థను రద్దు చేశామని ఆయన చెప్పారు. కొత్త రెవెన్యూ బిల్లు వల్ల భూస్వాములకు మేలు జరుగు తుందని బయట కొంత మంది అసత్య ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. అయితే రాష్ట్రంలో భూస్వాములు, జాగీర్దార్లు, జమీందార్లు లేరని ఆయన స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అవినీతికి ఆస్కారమే లేదని కెసిఆర్ పేర్కొన్నారు. పక్కా ప్రణాళికతో పేద రైతుల హక్కులు కాపాడుతామని కెసిఆర్ తెలిపారు. రెవెన్యూ కోర్టులు రద్దు చేశామని, భూ తగాదాలు ఉంటే కోర్టుకు వెళ్లవచ్చని ఆయన చెప్పారు. కొత్త రెవెన్యూ బిల్లు వల్ల అధికారులు లంచం డిమాండ్ చేసే అవకాశం లేకుండా పోయిందని ఆయన పేర్కొన్నారు. భూముల వివరాలను రెండు విభాగాలుగా చేస్తూ ధరణిలో అందుబాటులో ఉంచుతారు. అలాగే వ్యవసాయ,వ్యవసాయేతర భూముల వివరాలను పక్కాగా నిర్దేశించారు. తరతరాలుగా ప్రజలు అనుభవిస్తున్న బాధలకు చరమగీతం పాడి ముఖ్యంగా రైతులకు పేదలకు సరళీకృతమైనటువంటి కొత్త చట్టాన్ని ఈ సభలో ప్రతిపాదిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు.రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఈ బిల్లు వర్తిస్తుందని అన్నారు. అయితే సమగ్రంగా తీసుకుని వస్తున్న ఈ చట్టంపై ప్రజల్లో ఆసక్తి నెలకొందని గ్రామాల్లో సంబరాలు చేసుకుంటున్నారని అన్నారు. ధరణి పోర్టల్ రెండు భాగాలుగా ఉంటుంది. అగ్రికల్చర్, నాన్ అగ్రికల్చర్ వివరాలు ధరణిలో ఉంటాయి. ఈ పోర్టల్‌తో రైతులకు మేలు జరుగుతుంది. తెలంగాణ రాష్ట్ర భూభాగం 2.75కోట్ల ఎకరాలు. ధరణి పోర్టల్ పారదర్శకంగా ఉంటుంది. ప్రపంచంలో ఏమూలనైనా ధరణిని ఓపెన్ చేసి చూసుకోవచ్చు. ధరణి పోర్టలే అన్నింటికీ ఆయువు పట్టు. కొత్త చట్టం ప్రకారం ఏ అధికారికీ విచక్షణాధికారాలు ఉండవు. నాన్ అగ్రికల్చర్ భూములను సబ్ రిజిస్ట్రార్లు రిజిస్ట్రేషన్ చేస్తారని కేసీఆర్ స్పష్టం చేశారు. కొత్త రెవెన్యూ చట్టం ప్రకారం ఇక నుంచి తహసీల్దార్లే జాయింట్ రిజిస్ట్రార్లుగా వ్యవహరిస్తారని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. తహసీల్దార్లకు వ్యవసాయ భూములే రిజిస్ట్రేషన్ చేసే అధికారం ఉంటుంది అని సీఎం పేర్కొన్నారు. విద్యావంతులైతే డాక్యుమెంట్లు వాళ్లే రాసుకోవచ్చు. కావాలంటే ఫీజు చెల్లించి డాక్యుమెంట్ రైటర్ సాయం తీసుకోవచ్చు. క్రయ విక్రయాల రిజిస్ట్రేషన్ చేసిన వెంటనే పోర్టల్‌లో అప్‌డేట్ అవుతాయి. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ సహా అన్ని సేవలు ఏకకాలంలో పూర్తి అవుతాయని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. తరతరాలుగా ప్రజలు అనుభవిస్తున్న బాధలకు చరమగీతం పాడి ముఖ్యంగా రైతులకు, పేదలకు సరళీకృతమైన కొత్త చట్టాన్ని ఈ సభలో

ప్రతిపాదిస్తున్నందుకు సంతోషంగా ఉందని సీఎం అన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం సీలేరు ప్రాజెక్టును ఏపీకి కేటాయించి తెలంగాణకు అన్యాయం చేసిందని సీఎం కేసీఆర్ అన్నారు. ఏడు మండలాలను ఆంధ్రాలో అన్యాయంగా కలిపారని అన్నారు. తీవ్ర విద్యుత్ కొరత ఎదుర్కొంటున్న తరుణంలో ఈ పని చేశారని అన్నారు. దీనిపై బండ్‌కు పిలుపునిచ్చామని అన్నారు. రెవెన్యూ సంస్కరణల్లో భాగంగా వీఆర్వో వ్యవస్థను రద్దు చేశామని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. కోవిడ్ ప్రభావం వల్ల రెవెన్యూచట్టం ఆలస్యమైందని తెలిపారు. పాత రెవెన్యూ చట్టంతో రైతులు ఇబ్బందులు పడ్డారని, ఆ రెవెన్యూ చట్టంతో చాలా దారుణాలు చూశామన్నారు. వీఆర్వోల విశేషాధికారా లతో చాలా మంది నష్టపోయారని కేసీఆర్ పేర్కొన్నారు. భూమిశిస్తు ఎన్టీఆర్ ప్రభుత్వం రద్దు చేసిందని, టీఆర్ఎస్ ప్రభుత్వం కూడా భూమిశిస్తు వసూలు చేయడం లేదని కేసీఆర్ చెప్పారు. కొత్త రెవెన్యూ చట్టం తీసుకువచ్చింది.. సామాన్యుల కోసమేనని ఆయన తెలిపారు. కొందరు చట్టంపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. రైతుబంధు పథకం భూస్వాముల కోసం కాదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 25 ఎకరాలకు మించి ఉన్న రైతులు 0.11 శాతమేనని చెప్పారు. వీఆర్వోల దుర్మార్గాల నుంచి విముక్తి కోసమే కొత్త రెవెన్యూ చట్టం తీసుకువచ్చామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తహసీల్దార్లు కూడా ట్యాంపర్ చేయలేని విధంగా ధరణి సాఫ్ట్‌వేర్ రూపొందించడం జరిగిందని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా వర్షాలు

భారీ వర్షాలతో పలు జిల్లాల్లో పొంగి పొర్లుతున్న వాగులు వంకలు
రావులపాలెం మండలం ఈతకోటలో అత్యధికంగా 21.9 సెం.మీ వర్షపాతం
వర్షపు నీటితో నీట మునిగిన సూర్యాపేట పట్టణం

భారీ వర్షాలకు ములుగు జిల్లాలో కొట్టుకుపోయిన కల్వర్టుతో ఆగిపోయిన రవాణా

హైదరాబాద్,సెప్టెంబర్14(ఆర్ఎన్ఎ): ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వానలు దంచికొడుతున్నాయి. గత రెండు, మూడు రోజుల నుంచి పలు జిల్లాల్లో కుండపోత వర్షం కురుస్తుంది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లు తున్నాయి. పలు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ప్రధానంగా కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదయ్యింది. ఉత్తరాంధ్రలోని కొన్ని జిల్లాల్లో ఓ మాదిరిగా వర్షం పడింది. ఈ వానలకు వేలాది ఎకరాల్లో వరి, మిర్చి, వేరుసెనగ, పత్తి సహా ఇతర పంటలు నీట మునిగాయి. తూర్పుగోదావరి జిల్లా రావులపాలెం మండలం ఈతకోటలో అత్యధికంగా 21.9 సెం.మీ వర్షపాతం నమోదైంది. పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్రలో 19.1, కర్నూలు జిల్లా ఆత్మకూరులో 18.7, పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం మండలం తూర్పుతాళ్లులో 13సెం.మీ, తూర్పుగోదావరి జిల్లా ఏలేశ్వరంలో 11.4, బ్రహ్మంగారి మఠంలో 10.9, అనంతపురం జిల్లా యాడికిలో 9.9 సెం.మీ వర్షపాతం నమోదయ్యింది. దీంతో అధికారులు ఈ జిల్లా ప్రజలను హెచ్చరించారు. అలాగే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చెరువులు, కుంటలు అలుగు దుంకాయి. పంట పొలాలు నీట మునిగాయి. రోడ్లు దెబ్బతిన్నాయి. పలు చోట్ల రవాణాకు అంతరాయం ఏర్పడింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి కాటారం మండలంలోని వీరాపూర్ శివశంకర్ ప్రాజెక్ట్ చెరువుకు గండి పడింది. సుమారు 200 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని అంకంపల్లి వద్ద వర్షాలకు కల్వర్టు కొట్టుకుపోయి తాడ్వాయి కరకగుడెం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని సూరారం గ్రామంలో భారీ వర్షానికి ఇండ్లలోకి వర్షం నీరు చేరింది. చేకుంకుడు పాములా గ్రామంలో భారీ వర్షానికి కుంట కట్ట తెగి రామన్నపేట, అమ్మనబోలు రహదారి తెగిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మహబూబ్ నగర్ జిల్లా అంతటా భారీ వర్షం కురిసింది. అచ్చంపేట మండలంలోని లక్ష్మాపూర్, చెంచు పలుగు తండ, చౌటపల్లి గ్రామాల సమీపంలో వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సూర్యాపేట జిల్లా మఠంపల్లిలో పిడుగుపాటుకు బర్రె మృతి చెందింది. వరంగల్ జిల్లాలో వర్షానికి ధర్మసాగర్ మండల కేంద్రంలోని గుంటివాగు వద్ద కల్వర్టు తెగిపోయింది. పంటలు నీట మునిగాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చంద్రుగొండ మండలం ఎదుల వాగు పొంగి ప్రవహిస్తుండటంతో అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సూర్యాపేట మున్సిపల్ పరిధిలో చెరువులు పొంగిపొర్లుతున్నాయి. రాత్రి కురిసిన భారీ వర్షానికి సూర్యాపేట పట్టణం పూర్తిగా జలమయమైంది. ఆత్మకూర్ (ఎస్) మండలం నశింపేట వద్ద ప్రవహిస్తోన్న వాగును దాటే క్రమంలో గొర్రెలను తరలించే వాహనం నీటిలో కొట్టుకు పోయింది. వెంటనే గుర్తించిన స్థానికులు వాహనంలోని ముగ్గురిని కాపాడారు. పట్టణ ప్రాంతాలైన శ్రీనివాసకాలనీ, మానస నగర్, ఇందిరమ్మ కాలనీ శివారు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షపు నీరు వచ్చి చేరింది. సద్దుల చెరువు, పుల్లారెడ్డి, నల్లచెరువు ఉధృతంగా ప్రవహిస్తున్నఈ నేపథ్యంలో.. విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి మున్సిపల్, రెవెన్యూ అధికారులతో సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజలకు ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో టీమ్‌లుగా విడిపోయి ఆర్డీవో రాజేంద్ర కుమార్, మున్సిపల్ చైర్మన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్టాకిశోర్, కౌన్సిలర్లు పట్టణంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. పలు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు.

విద్యారంగ పటిష్టతకే ప్రైవేట్ యూనివర్సిటీలు

పోటీని తట్టుకునేందుకు అనుమతులు ఇచ్చాం
అసెంబ్లీలో సభ్యుల అనుమానాలపై మంత్రి సబిత సమాధానం

హైదరాబాద్,సెప్టెంబర్14(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలోని యూనివర్సిటీలతో పాటు ప్రైవేటు యూనివర్సిటీలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. విద్యారంగంలో ఇప్పటి వరకు ప్రభుత్వం ఉన్నత విద్యాకు ప్రోత్సహిస్తూ వచ్చిందని, అయితే పోటీని తట్టుకునేందుకు ప్రైవేట్ రంగాన్ని కూడా ప్రోత్సహించాల్సి వస్తోందని అన్నారు. తెలంగాణ స్టేట్ ప్రయివేటు యూనివర్సిటీస్ బిల్లుపై శాసనసభలో చర్చ సందర్భంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సబిత వివరణ ఇచ్చారు. దేశంలో ప్రాథమిక విద్యలో వందశాతం స్థూల జాతీయ నమోదు ఉన్నప్పటికీ, మాధ్యమిక, ఉన్నత విద్యలో ఇది కొంత క్షీణించిందని తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారి సంఖ్య రోజురోజుకు గణనీయంగా పెరుగుతూ వస్తుందని చెప్పారు. దేశంలో దాదాపు ఉన్నత విద్యా రంగం ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగిందన్నారు. కానీ మారుతున్న పరిస్థితుల కారణంగా, విద్యార్థుల నుంచి వస్తున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఉన్నత విద్యలో ప్రయివేటు యూనివర్సిటీల అవసరం ఉందని భారత ప్రభుత్వం గుర్తించింది. యూనివర్సిటీలతో పాటు డీమ్డ్ యూనివర్సిటీలకు కూడా కేంద్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని తెలిపారు. ఆగస్టు 8, 2020 నాటికి మన దేశంలో 950 యూనివర్సిటీలు ఉన్నాయి. దేశ వ్యాప్తంగా 53 సెంట్రల్ యూనివర్సిటీలు, 412 స్టేట్ యూనివర్సిటీలు, 124 డీమ్డ్ యూనివర్సిటీలు, 361 ప్రైవేటు యూనివర్సిటీలు ఉన్నాయని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఉన్నత విద్యను

ప్రైవేట్ యూనివర్సిటీల బిల్లుపై జరిగిన చర్చలో అసెంబ్లీలో మాట్లాడుతున్న విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి.

పటిష్టం చేసేందుకు సీఎం కేసీఆర్ చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రం ఏర్పాటైన తర్వాత స్కూల్ ఎడ్యుకేషన్, ఉన్నత విద్యను, టెక్నికల్ ఎడ్యుకేషన్‌ను బలోపేతం చేస్తున్నామని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో గురుకులా లను ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 959 గురుకులాలు ఉన్నాయని తెలిపారు. తెలంగాణ లో ఉన్నత విద్యను అభ్యసించే వారి సంఖ్య గణనీయంగా పెరిగిపోతూ ఉంది. రాష్ట్ర విద్యార్థులు ఇతర రాష్ట్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలోనే విద్యార్థుల డిమాండ్ మేరకే ప్రయివేటు యూనివర్సిటీల ప్రతిపాదనను తీసుకొచ్చామన్నారు. తెలంగాణలో ప్రయివేటు యూనివర్సిటీలకు సంబంధించి మొత్తం 16 ప్రతిపాదనలు వచ్చాయని గుర్తు చేశారు. వీటిలో 8 ప్రతిపాదనలకు ప్రభుత్వం ఒకే చెప్పిందని తెలిపారు. ఇందులో 5 ప్రయివేటు యూనివర్సిటీలకు ఆమోదం తెలిపినట్లు మంత్రి సబిత పేర్కొన్నారు. మిగతా మూడింటికి త్వరలోనే ఆమోదం తెలుపుతామన్నారు. ప్రయివేటు యూనివర్సిటీల స్థానంలో దేశంలో తెలంగాణ 25వ స్థానంలో ఉందన్నారు. అదే సమయంలో రాష్ట్ర యూనివర్సిటీలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం లేదన్నారు. త్వరలోనే వీసీలను, అధ్యాపకులను భర్తీ చేస్తామన్నారు. ఇప్పటికే పోస్టుల భర్తీ పక్రియకు అనుమతులు మంజూరు చేశామన్నారు. కానీ న్యాయ పరమైన సమస్యలు రావడం వల్లే కొంత జాప్యం జరిగిందన్నారు.

టీఎస్ బీపాస్ బిల్లుకు శాసనసభ ఆమోదం

పట్టణీకరణలో తెలంగాణ నంబర్ వన్
ఇంటి నిర్మాణాల్లో సులభంగా అనుమతులు
75 గజాల వరకు నిర్మాణాలకు నో పర్మిషన్
75 గజాల పైన 600 గజాల వరకు ఇన్‌స్టాంట్ అనుమతులు
సభలో వెల్లడించిన ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్

హైదరాబాద్,సెప్టెంబర్14(ఆర్ఎన్ఎ): భారతదేశంలోనే శరవేగంగా పట్టణీకరణ చెందుతున్న రాష్ట్రాల్లో భారతదేశంలో తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉందని ఐటి,పురపాలక శాఖ మంత్రి కెటిఆర్ అన్నారు. దాదాపుగా రాష్ట్రంలో 42 శాతం జనాభా పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ఈ క్రమంలో పట్టణాల్లో సరైన మౌలిక వసతులు కల్పించాలని లక్ష్యం పెట్టుకున్నట్లు వెల్లడించారు. పురపాలనలో సమూల మార్పులు తేవాలనే ఉద్దేశంతో నూతన పురపాలక చట్టాన్ని 2019లో తీసుకువచ్చామన్నారు. పౌరుడు కేంద్రంగా పారదర్శకంగా సేవలందించాలని రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకుంది. పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా ప్రతి మున్సిపాలిటీకి జనాభా నిష్పత్తి ప్రకారం నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా అసెంబ్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన టీఎస్ బీపాస్ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ పట్టణంలో నివసించే పౌరులు సొంత ఇల్లు నిర్మించుకోవడానికి తీసుకోవాల్సిన అనుమతుల విషయంలో కొన్ని ఇబ్బందులు గమనించాం. అవినీతిని గమనించి 2015లో డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టం(డీపీఎంఎస్)ను అన్ని మున్సిపాలిటీల్లో ప్రవేశపెట్టాం. దీనికి చట్టబద్ధత లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ

క్రమంలో 100 శాతం పారదర్శకత తీసుకురావాలనే ఉద్దేశంతో.. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు టీఎస్ బీపాస్ చట్టాన్ని తీసుకువస్తున్నామని కేటీఆర్ తెలిపారు. టీఎస్ బీపాస్ చట్టం వల్ల పేదలు, మధ్య తరగతి ప్రజలకు మేలు జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. టీఎస్ బీపాస్ చట్టం కోసం లోతుగా అధ్యయనం చేశామన్నారు. హైదరాబాద్‌తో సహా రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు ఈ చట్టం వర్తిస్తుందన్నారు.

మున్సిపాలిటీల పరిధిల్లో 75 గజాలలోపు స్థలం ఉన్న వారికి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదు. 75 నుంచి 600 గజాల వరకు స్థలం ఉన్న వారు ఇన్‌స్టంట్ పర్మిషన్ తీసుకోవచ్చు. 600 గజాల పైన స్థలం ఉన్న వారు 21 రోజుల్లోనే అన్ని అనుమతులు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. 21 రోజుల్లో పర్మిషన్ రాకపోతే 22వ రోజు డీమ్డ్ అప్రూవల్ వస్తుందని పేర్కొన్నారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కూడా 15 రోజుల్లోనే ఇస్తామన్నారు. ఈ బిల్లు అమలు పర్యవేక్షణకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేస్తామని కేటీఆర్ తెలిపారు. తప్పుడు ప్రదేశంలో నిర్మాణాలు ఉంటే నోటీసులు ఇవ్వకుండానే కూల్చి వేస్తామని మంత్రి స్పష్టం చేశారు. చట్టం పట్ల ప్రజలకు భయం, గౌరవం ఉండాలి. అన్ని పట్టణాలకు మాస్టర్ ప్లాన్లు రూపొందిస్తున్నామని మంత్రి కేటీఆర్ తెలిపారు.

కరోనాతో జానపద కళాకారుడు శంకర్ మృతి

మహబూబాబాద్,సెప్టెంబర్14(ఆర్ఎన్ఎ): జానపద కళాకారుడు, సినీనటుడు, గాయకుడు, కొంకాల శంకర్ కరోనా బారిన పడి మృతి చెందారు. జిల్లాలోని కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన శంకర్ కొద్దిరోజుల క్రితం కరోనా బారిన పడ్డారు. గూడూరు కొవిడ్ కేంద్రంలో చికిత్స పొంది ఈ మధ్యనే ఇంటి వద్ద హోమ్ ఐసోలేషన్ లో ఉన్నారు. శ్వాస సమస్య తీవ్రమవడంతో మహబూబాబాద్ కొవిడ్ కేంద్రానికి తరలించగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. జానపద కళాకారునిగా గుర్తింపు పొందిన ఆయన రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రదర్శనలు ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు

చేరవచేసేందుకు అనేక ప్రదర్శనలు ఇచ్చారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆయన రాష్ట్రం ఏర్పాటైన అనంతరం సాంస్కృతిక సారథిగా నియామకం అయ్యారు. పలు సీరియల్స్, సినిమాల్లో నటించారు. ఆయన మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

సింగరేణిలో ఖాళీలను బట్టి అర్హులకు ఉద్యోగాలు

కొత్తగా ఖాళీలు సృష్టించడం కుదరదు
అసెంబ్లీలో సిఎం కెసిఆర్ స్పష్టీకరణ

హైదరాబాద్,సెప్టెంబర్14(ఆర్ఎన్ఎ): సింగరేణిలో ఖాళీలను బట్టి అర్హత ఉన్న వారికి కచ్చితంగా ఉద్యోగం ఇస్తామని సిఎం కెసిఆర్ అసెంబ్లీలో స్పష్టంచేశారు. చదువుకు సమాన స్థాయి ఉద్యోగాలు ఖాళీ అయినప్పుడు నియమిస్తామన్నారు. పోస్టులు సృష్టించి ఇవ్వబడవు అని కూడా స్పష్టం చేశారు. సింగరేణిలో కారుణ్య నియామకాలపై ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు శాసనసభ వేదికగా స్పందించారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా సింగరేణి సమస్యలపై సభ్యులు అడిగిన ప్రశ్నల సందర్భంగా సీఎం కేసీఆర్ వివరణ ఇచ్చారు. సంస్థ మంచి, చెడులు వారికి తెలియాలి. ఈ క్రమంలో వారిని తక్షణమే జనరల్ మజ్దూర్ గా తీసుకుంటాం. కొద్ది రోజులు వారికి శిక్షణ ఇచ్చి అప్‌గ్రేడ్ చేసి పోస్టులోకి తీసుకుంటాం అని కేసీఆర్ స్పష్టం చేశారు. సింగరేణి కార్మికులకు ఇన్‌కం ట్యాక్స్ రద్దు చేయాలని ప్రధాని మోదీని అనేకసార్లు కోరామని తెలిపారు. కేంద్రం పట్టించుకోవడం లేదు. సింగరేణి కార్మికుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. రిటైర్ అయిన సింగరేణి కార్మికులను గౌర

బిజెపిని నిలువరించడానికి సన్నద్ధమేనా?

నేటినిజం
మంగళవారం 15-9-2020

బిజెపికి ప్రత్యామ్నాయాంగా కాంగ్రెస్ విఫలమైందన్న భావన ఇప్పుడు ప్రజల్లో ఏర్పడింది. కరోనా నేపథ్యం లో ప్రజలంతా అల్లాడుతున్న వేళ పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ దశలో కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు, ఇతర పక్షాలు ప్రజల పక్షాన ఎలాంటి పోరాటం చేస్తాయన్నది ఆసక్తిగా ఉంది. కరోనా కష్టాలతో సామాన్య,పేద,మధ్యతరగతి ప్రజలు జీవించడానికి నానా కష్టాలు పడుతున్నారు.అలాగే ఉపాధి కోల్పోయిన లక్షలాది మంది ప్రజలు ప్రత్యామ్నాయా ఉపాధి మార్గాలు వెతుక్కుంటున్నారు. రాజకీయ పార్టీలు మాత్రం అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఒకలా..కేంద్రంతో మరోలా మాట్లాడుతున్నాయి. బిజెపి, కాంగ్రెస్, టిఆర్ఎస్, శివసేన, లెఫ్ట్ పార్టీలు ఎవరికి వారు తమకుతోచిన సిద్దాంతాలను వల్లెవేస్తూ ప్రజల దృష్టిని మళ్లిస్తున్నాయి. పార్లమెంట్ సమేశాల్లో కేంద్రాన్ని నిలదీస్తామంటున్న ఆయా పార్టీలు తమ రాష్ట్రాల్లో వైఫల్యాలను కప్పి పుచ్చుకుని మాట్లాడుతున్నాయి. ఆయా రాష్ట్రాల్లో తమకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న పార్టీలను అణచి వేసే ధోరణిని ప్రదర్శిస్తున్నాయి. ఈ హెచ్చరికలను ఆషామాషీగా తీసుకోవడానికి లేదు. కాంగ్రెస్ సహా అన్ని పార్టీలకు ఇప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి తీరుపై మండిపాటుగానే ఉంది. కానీ గతంలో తాము చేసిన పాపాలను మాత్రం ప్రస్తావించడం లేదు. ఇకపోతే బిజెపికి వ్యతిరేకంగా కలసి పోరాడాలన్న ఐక్యతను కూడా ప్రదర్శించడం లేదు. పార్లమెంట్ సమావేశాలకు ముందు అన్ని పార్టీలు కూర్చుని వివిధ సమస్యలపై ఏకాభిప్రాయం సాధించే చర్యలకు ఉపక్రమించలేదు. అలాగే కాంగ్రెస్ పెద్దన్న పాత్ర పోషిద్దా మన్నా దానిని నమ్మేందుకు ఇతర పార్టీలు సిద్దంగా లేవు. ఈ దశలో పెద్దన్న పాత్ర పోషించి ముందుకు సాగాలన్న ఆలోచనతో తెలంగాణ సిఎం కెసిఆర్ గత ఎన్నికలకు ముందు చూచాయగా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అయినా ఆయన తన ఆలోచనలను పక్కన పెట్టలేదని తెలుస్తోంది. తానే నాయకత్వ బాధ్యత తో ముందుకు సాగాలని చూస్తున్నారు. అయితే ఆయన వైఖరి కూడా ప్రజాస్వామ్యయుతంగా ఉండడం లేదు. రాష్ట్రంలో విపక్షాలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. ప్రజాస్వామ్యయుతంగా సమస్యలపై స్పందించడం లేదన్న విపక్షాల నిరసనలు పట్టించుకోవడం లేదు. తెలంగాణలో అలాంటి మోడల్ చూపించి ఉంటే జాతీయ స్థాయిలో ఆదరణ పెరిగేది. అయినా పట్టువదలని విక్రమార్కుడిలా సందర్భం వచ్చినప్పు డల్లా బీజేపీని, ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వాన్ని కేసీఆర్ కూడా తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇక కేంద్రంపై యుద్ధమే అన్నట్టుగా టీఆర్ఎస్ ఎంపీలు ఈ మధ్య ప్రకటించారు. అలాగే బీజేపీ వ్యూహాలను ముందుగా పసిగట్టి జాతీయ రాజకీయాల ప్రతిపాదనతో బిజెపికి చెక్ పెట్టాలని కెసిఆర్ చూస్తున్నారని అర్థం చేసుకోవచ్చు. లోక్‌సభ ఎన్నికలు జరిగిన నాటి నుంచి టీఆర్ఎస్ జాతీయ రాజకీయాలపై దృష్టి సారించి, కెసిఆర్ అడుగు వేసినా..ఆయన బాటలో అడుగులు వేయడానికి దేశంలోని వివిధ ప్రాంతీలయ పార్టీలు ముందుకు రావడం లేదు. జాతీయ రాజకీయాల కోసం తాను ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకొంటానని కేసీఆర్ చాలా కాలంగా చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించాక.. తాను తొలి ముఖ్యమంత్రిగా కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేయడం, రైతుబంధు పథకం అమలుచేయడంతో పాటు యాదాద్రి నిర్మాణం పూర్తి చేశానన్న సంతృప్తితో అధికారం నుంచి తప్పుకోవాలని ఆయన భావిస్తున్నట్టు చెబుతున్నారు. ముఖ్యమంత్రి గా ఇక తాను చేయగలిగింది, చేయాల్సింది ఏమీ లేదు కనుక ప్రజల్లో తన పరపతి పతాకస్థాయిలో ఉన్నప్పుడే అధికారం నుంచి తప్పుకోవడంతో పాటు.. జాతీయ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించాలని చూస్తున్నారు. ఈ రకంగా దేశంతో పాటు,తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోవచ్చునని కూడా ఆయన భావిస్తున్నారని అనుకోవచ్చు. అదే సమయంలో రాజకీయంగా తాను బలంగా ఉన్నప్పుడే..

కుమారుడు కేటీఆర్‌ను ముఖ్యమంత్రిని చేస్తే ఒడిదుడుకులు ఎదురు కావని భావిస్తున్నారు. అయితే ముఖ్యమంత్రి పదవికి కేసీఆర్ రాజీనామా చేస్తే జాతీయ రాజకీయాల్లో మరింత ఉత్సాహంగా పాల్గొనేలా రాజ్యసభకు వెళ్లడం ద్వారా జాతీయ రాజకీయాల్లో కుదురుకోవచ్చని పార్టీ నాయకులు అభిప్రాయ పడుతున్నారు. పార్టీ పార్లమెంటరీ నేతగా ఆయన అక్కడ పాత్ర నిర్వహిస్తూనే జాతీయరాజకీయాల్లో వివిధ పార్టీలను ఏకం చేసేందుకు కృషి చేస్తారని అంటున్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఇంకా కొంత ఇమేజ్ ఉన్నా దానిని నమ్మడానికి ప్రజలు సిద్దంగా లేరు. అలాగని ఇతర పార్టీలు కూడా కాంగ్రెస్ లేదా, కెసిఆర్ ఏర్పాటు చేసే పక్షాన బేషరతుగా పనిచేసేందుకు కూడా సిద్దంగా లేరు. ఇకపోతే ఇప్పుడున్న పరిస్థితుల్లో బిజెపిని అంత సులువగా ఢీకొనడం కూడా సాధ్యం కాకపోవచ్చు. కాంగ్రెస్ ముక్త్ భారత్ కావాలని నినదించిన బీజేపీని, కాంగ్రెస్‌ను పక్కన పెట్టడం ద్వారా ప్రజల్లో కొత్త ఆశలు కలిగిస్తే తప్ప జాతీయ రాజకీయాలకు ప్రాధాన్యం లేదు. తాజా అంచనాల మేరకు కరోనా కష్టాలపై కెసిఆర్ బాగా అధ్యయనం చేస్తున్నారు. కేంద్రం ఏం చేయవచ్చో..కానీ ఎందుకు చేయలేదో అన్నది బాగా ఆకళింపు చేసుకున్నారు. ఇలా అనేకానేక సమస్యలను చర్చించిన ముఖ్యమంత్రి, టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పూర్తి స్థాయిలో జాతీయ రాజకీయాల్లోకి అడుగు పెట్టనున్నట్లు ప్రచారం సాగుతోంది. ప్రజల ఆకాంక్షలను ఆ రెండు పార్టీలూ నెరవేర్చలేకపోయాయని, కేంద్ర రాజకీయాల్లో జోక్యం చేసుకుంటానని ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసిన కెసిఆర్ జాతీయ పార్టీ పెట్టే దిశగా అడుగులు వేస్తున్నారు 2022 చివర్లో కానీ, 2023లో కానీ జమిలి ఎన్నికలకు వెళ్లాలని కేంద్రంలోని బీజేపీ భావిస్తున్నట్లు సంకేతాలు వస్తున్నాయి. ఈ దిశగా పావులు కూడా కదుపుతోంది. ఇందుకు ఆరెస్సెస్ ఆధ్వర్యంలో ఓ అంతర్గత కమిటీ పనిచేస్తోందన్న వాదనా ఉంది. దేశంలో అధ్యక్ష తరహా ఎన్నికల నిర్వహణకు సాధ్యాసాధ్యాలను ఈ కమిటీ చురుగ్గా పరిశీలిస్తోంది. అధ్యక్ష తరహా పాలన అమల్లోకి వస్తే లోక్‌సభ ఎన్నికల్లో కేవలం జాతీయ పార్టీలు మాత్రమే పోటీ చేసే అవకాశం ఉంటుంది. ప్రాంతీయ పార్టీలు అసెంబ్లీ ఎన్నికలకు మాత్రమే పరిమితం కావాల్సి ఉంటుంది. ఈ ముప్పును గ్రహించి కెసిఆర్ ముందే పావులు కదుపుతున్నారని కూడా అనుకుంటున్నారు. అయితే కెసిఆర్ ప్రయత్నం మంచిదే అయినా మిగతా పార్టీల సహకారం లేని ఆయా రాష్ట్రాల్లో నెగ్గుకు రావడం కష్టం.

విమోచనపై గతాన్ని మరచి మాట్లాడడం తగదు: బీజేపీ ఎమ్మెల్సీ

హైదరాబాద్,సెప్టెంబర్14(ఆర్ఎన్ఎ): తెలంగాణ విమోచన దినాన్ని మరచిపోయి మాట్లాడుతున్న వారు గతంలో ఏం మాట్లాడారో గుర్తుకు తెచ్చుకుంటే మంచిదని బిజెపి నేత, ఎమ్మెల్సీ రామచంద్రరావు అన్నారు. గతంలో తెలంగాణ ఉద్యమ సమయంలో విమోనోత్సవాలను జరపాలని డిమాండ్ చేసిన వారు, అధికారంలోకి రాగానే మాట మార్చడం తెలంగాణ ప్రజలను అవమానించడం తప్ప మరోటి కాదని అన్నారు. ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే వరకు ఉద్యమాలు చేపడతామని అన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ అమరవీరుల త్యాగాలు వృథా అవుతున్నాయని, వాటి గురించి నేటి తరానికి తెలియాల్సిన అవసరముందని చెప్పారు. అమరుల వారి జీవిత చరిత్రను పాఠ్యాంశాలుగా చేసి నేటి యువతకు తెలియజెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని చెప్పారు. అధికారంలోకి రాగానే విమోచనా దినాన్ని అధికారికంగా నిర్వహిస్తామన్న సీఎం కేసీఆర్ ఇప్పుడు మజ్లిస్ పార్టీకి భయపడి మాట మార్చారని ఆరోపించారు. ఇలాంటి చర్యలను బీజేపీ చూస్తూ ఊరుకోదన్నారు. విమోచన దినం కోసం యాత్ర నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చామన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై విస్తృత ప్రచారం చేయాలి

ఆదిలాబాద్,సెప్టెంబర్14(ఆర్ఎన్ఎ): ఎల్ఆర్ఎస్‌పై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని ఆదిలాబాద్ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మున్సిపాలిటీలో నూతనంగా చేరిన గ్రామాల్లో అనేక లేఅవుట్లు అనుమతులు లేకుండా ఉన్నాయని, ఆ ప్రాంతాల్లో ప్రచారం చేస్తే ప్రజలకు లాభం కలుగుతుందని తెలిపారు. ఇకపోతే ఇప్పటికే కొనసాగుతున్న మేరకు ప్రభుత్వం ప్రారంభించిన ఆన్‌లైన్ విద్యపై ఉపాధ్యాయులు, ప్రధానో పాధ్యాయులు ప్రత్యేక దృష్టిపెట్టాలని సిక్తా పట్నాయక్ సూచించారు. ప్రతి విద్యార్థికి మేలు జరిగేలా చూడాలన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలకు ప్రభుత్వం నుంచి వచ్చిన 80 డ్యూయల్ డెస్కులను అందజేశారు. విద్యార్థులు ఆన్‌లైన్ తరగతులు వినేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఉపాధ్యాయులకు సూచించారు. గత కొన్నేళ్లుగా వివిధ పోటీ పరీక్షలు, ఆవిష్కరణల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపడం ఆనందంగా ఉందని, ఇంకా ప్రోత్సహించాలన్నారు. ఆదిలాబాద్‌కు ముఖ్యమంత్రి కేసీఆర్ కేటాయించిన రూ.250 కోట్ల అభివృద్ధి నిధుల నుంచి పాఠశాలలకు డ్యూయల్ డెస్కులను అందించాలని ఎమ్మెల్యే జోగు రామన్న తెలిపారన్నారు. ఇందులో భాగంగా 11 పాఠశాలలకు రూ.28 లక్షలతో సుమారు 450 డెస్కులను అందజేస్తున్నామని తెలిపారు.

ఆన్‌లైన్ తరగతులను టీచర్లు పర్యవేక్షించాలి: డిఇవో

జనగామ,సెప్టెంబర్14(ఆర్ఎన్ఎ): ఆన్‌లైన్ పాఠాలను విద్యార్థులు శ్రద్ధగా వినేలా పరిశీలించడమేగాక వారిని ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని డీఈవో యాదయ్య అన్నారు. ఇటీవల వరుసగా ఆయన విద్యార్థుల ఇళ్లకు వెళుతూ టీవీలు, స్మార్ట్‌ఫోన్లలో వస్తున్న పాఠాలను వింటున్న తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు పాఠాలు వినేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. వారికి రోజువారీ వర్క్‌షీట్ ఇవ్వాలని, దానిని పూర్తి చేసిన అనంతరం తీసుకోవాలని కోరారు. ఆన్‌లైన్లో పాఠాలు వింటున్న విద్యార్థుల వివరాలు నోట్ చేసుకోవాలని, వినని వారి గురించి తెలుసుకుని సమస్యను పరిష్కరించాలని సూచించారు. తెలంగాణ విద్యాశాఖ ఆన్‌లైన్ పాఠాలను ప్రారంభించిన నేపథ్యంలో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఆన్‌లైన్ పాఠాలపై వారి అభిప్రాయాలు తెలుసుకుంటున్నారు.జిల్లాలోని 540 ప్రభుత్వ పాఠశాలల్లో 3 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్ బోధన వీక్షించేందుకు ఏర్పాట్లు చేశామని అన్నారు. దీనిపై ఉపాధ్యాయులకు ఆదేశాలు ఇచ్చామని ఆయన పేర్కొన్నారు. ప్రతి రోజూ 3 నుంచి 5వ తగరతి విద్యార్థులకు 1.30 గంటలకు, 6, 7, 8వ తరగతి విద్యార్థులకు 2 గంటలకు, 9, 10వ తరగతి విద్యార్థులకు 3 గంటలకు ఆన్‌లైన్ బోధన ప్రారంభమవుతుందని డీఈవో వివరించారు. క్లాసులు ప్రారంభమైనప్పుడు తల్లిదండ్రులు పిల్లలకు సహకరించాలని కోరారు. డీటీహెచ్, స్మార్ట్ ఫోన్లు అందుబాటులో లేని వారికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఎ

కరోనా నిబంధనల మేరకు ధాన్యం సేకరణ

–ముందస్తు జాగ్రత్తలతో ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్

ఖమ్మం,సెప్టెంబర్14(ఆర్ఎన్ఎ): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొవిడ్ 19 నిబంధనలు పాటించాలని కలెక్టర్ ఆర్వీకర్ణన్ అధికారులను ఆదేశించారు. రైతుల ఉత్పత్తులను, వ్యవసాయ విస్తరణ అధికారులు ముందుగానే తేమశాతం పరీక్షించుకోవాలని అన్నారు. పరీక్షించిన ధాన్యంను కొనుగోలు కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తరలించేందుకు రవాణా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ మేరకు ధాన్యం సేకరణకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పంట సీజన్ ధాన్యం సేకరణ యాక్షన్ ప్లాన్‌పై ఇప్పటికే ఆయన అధికారులతో చర్చించారు. వేసవిలో 438 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి రికార్డుస్థాయిలో ధాన్యం సేకరించామని, వానాకాలం ధాన్యం సేకరణకు కూడా 400కుపైగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో 5లక్షల55వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగలదన్న అంచనా ఉందని, సివిల్ సప్లయిస్ ద్వారా 4.5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా యాక్షన్‌ప్లాన్ చేయాలన్నారు. ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎ?సలో ఈసీజన్‌లో ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. గత సీజన్‌లో జిల్లాలో నాలుగు సెక్టార్లు ఉండగా ఈసీజన్‌లో మొత్తం ఎనిమిది సెక్టార్లగా చేయాలని వివరించారు. ప్రతీ సెక్టార్లుకు 50వాహనాలు కేటాయించాలని, ప్రభుత్వం నిర్దేశిరచిన విధంగా ఏ గ్రేడ్‌కు రూ.1,888, కామన్ రకానికి రూ.1,860 మద్దతు ధర ఇవ్వాలని కొనుగోలు కేంద్రాలనుంచి మిల్లులకు ధాన్యం తరలించేందుకు గన్నీబ్యాగులు అవసరమైనంత మేరకు ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు.అగ్రికల్చర్, మార్కెటింగ్ సివిల్ సప్లయిస్, రవాణాశాఖ సమన్వయంతో సమగ్ర ప్రణాళికతో ఉండాలని సూచించారు.

యాదాద్రిని త్వరగా పూర్తి చేయించే పనుల్లో కెసిఆర్

మహాసుదర్శన యాగం తరవాత పొలిటికల్ టర్న్
జాతీయ రాజకీయాల కోసం వేదిక సిద్ధం చేస్తున్న బాస్

హైదరాబాద్,సెప్టెంబర్14(ఆర్ఎన్ఎ): తెలంగాణ ఏర్పాటు తరవాత రాష్ట్రంలో అనేకానేక విప్లవాత్మక కార్యక్రమాలు చేపట్టిన సిఎం కెసిఆర్ యాదాద్రిని కూడా త్వరగా పూర్తి చేస్తే ఇక తనక్ష్యం నెరవేరినట్లుగానే భావిస్తున్నారు. నిజానికి ఈ బృహత్తర కార్యక్రమం కేవలం కేసిఆర్ వల్ల మాత్రమే సాధ్యమవుతోందన్న భావన నూటికినూరుశాతం ప్రజల్లో నెలకొంది. మరొకరు ఎవరు కూడా యాదాద్రిని పునర్నిర్మించే సాహసం చేసి ఉండేవారు కాదు. ఆలస్యం అయినా అదో భవ్య మందిరంగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోనుంది. చాళుక్యులు తదితరుల తరవాతి స్థానంలో కెసిఆర్ నిలిచిపోతారు. యాదాద్రిలో ఆలయ నిర్మాణాలు పూర్తయి, ప్రాజెక్టు కూడా పూరతయితే ఇక మహాసుదర్శన యాగం ద్వారా ప్రజలక ఆలయాన్ని అందు బాటులోకి తీసుకని వస్తారు. ఈ క్రతువు ముగిస్తే కాళేశ్వరం, యాదాద్రి లాంటి భారీ ప్రాజెక్టులను తెలంగాణ చరిత్ర ఉన్నంత వరకు ప్రజలు గుర్తుంచుకుంటారు. ఈ సంకల్పంతో జాతీయ రాజకీయాల్లోకి అడుగు పెట్టే క్రమంలో వీలైనంత త్వరగా కేటీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయాలన్న ఆలోచనకు కేసీఆర్ వచ్చినట్టు చెబుతున్నారు. యాదాద్రిలో యాగం నిర్వహించిన తర్వాత లేదా నూతన సచివాలయ నిర్మాణం పూర్తయిన తర్వాత కేటీఆర్‌ను ముఖ్యమంత్రి చేయడం ఖాయమని చెబుతున్నారు. నిజానికి కేటీఆర్ ఇప్పటికే ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యమంత్రుల పర్యటనల సందర్భంగా మంత్రులు ఎలాంటి ఏర్పాట్లు చేస్తారో.. ఇప్పుడు కేటీఆర్ జిల్లాల పర్యటన సందర్భంగా అలాంటి ఏర్పాట్లే చేస్తున్నారు! ఈ నేపథ్యంలో కేటీఆర్ పట్టాభిషేకానికి ముహూర్తం ఎప్పుడనేది ఇప్పుడు తెలంగాణలో చర్చిస్తున్నారు. మరోవైపు బిజెపి కూడా కెసిఆర్‌తో సఖ్యత కన్నా ఆయనను ఢీకొనేందుకే సిద్దంగా ఉంది. ఇటీవల ఆ పార్టీ దూకుడు పెంచింది. తాజాగా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని మరోమారు తెరపైకి తెచ్చి యాత్రలు చేస్తోంది. గతంలో టిఆర్ఎస్‌తో ఉన్న బీజేపీ మధ్య సంబంధాలు కూడా దెబ్బతిన్నాయి. దీంతో బీజేపీ తెలంగాణలో తన వ్యూహాన్ని మార్చుకుంది. కేసీఆర్‌తో అమీతుమీ తేల్చుకోవడానికి ఆ పార్టీ నిర్ణయించు కుంది. తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులలో భారీగా అవినీతి జరుగుతోందని బీజేపీ నాయకులు ఇటీవల విమర్శలు చేయడం మొదలుపెట్టారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో జెండా ఎగురవేయాలని బీజేపీ నాయకులు భావిస్తున్నారు. ఈ ఆలోచనలను పసిగట్టడం వల్లనే జాతీయ రాజకీయపార్టీ ఆలోచనను కేసీఆర్ తెర మీదకు తెచ్చి ఉంటారు. బీజేపీ నుంచి ఎదురుకాబోయే ముప్పును ఢీకొనేలా కెసిఆర్ కార్యాచరణ కూడా చేస్తూ ఉంటారు. తాను జాతీయ రాజకీయాల్లో చురుకుగా పాల్గొనేందుకు ప్రాతిపదికను సిద్దం చేసుకుని ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకొని కేటీఆర్‌కు పట్టాభిషేకం చేయాలని కేసీఆర్ తలపోస్తున్నట్లు టీఆర్ఎస్ వర్గాలు భావిస్తున్నాయి. ఇందులో భాగంగా ఇటు కేసీఆర్, అటు బీజేపీ పెద్దలు వేస్తున్న ఈ ఎత్తుగడలలో ఎవరిది పైచేయి అవుతుందో చూడాలి.

అవినీతి రాజకీయాల తుప్పు వదిలేనా?

సుప్రీం ఆదేశాలపై కేంద్రం చర్యలకు సిద్ధపడుతుందా
రాజకీయ ప్రయోజనాలపై బిజెపి చురుకుగా పరిశీలన

న్యూఢిల్లీ,సెప్టెంబర్14(ఆర్ఎన్ఎ): రాజకీయ నాయకుల అవినీతిపై తక్షణ విచారణ జరపాలని, ప్రధాని సహా ముఖ్యమంత్రులు, మంత్రుల అవినీతిపై పోరాడాలన్న సామాజిక ఉద్యమనేత అన్నా హజారే పోరాటం చేసినా అందుకు బిజెపి మాత్రం సిద్ధంగా లేదు. ఆయన కోరుకున్నట్లుగా లోక్‌పాల్ వ్యవస్థను ప్రవేశ పెట్టలేదు. ఇప్పటికే భారత రాజకీయాల్లో అవినీతి పెరిగింది. విచ్చలవిడి రాజకీయ అవినీతి కారణంగా ప్రజల్లో కూడా తీవ్ర వ్యతిరేకత వస్తోంది. కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిక పెద్దగా కుంభకోణాలు జరిగినట్లు దాఖలాలు లేకున్నా..మరో రకంగా ఇతరులకు ప్రయోజనాలు కలుగుతున్నాయన్న భావన ఉంది. ఆదానీ, అంబానీలకు కాంట్రాక్టులు కట్టబెట్టడం సహా అనేకాక ప్రయోజనాలు కలగిస్తున్నారన ఆరోపణలు ఉన్నాయి. రాజకీయ నాయకులపై నమోదైన కేసులలో విచారణ పూర్తికావడానికి ఏళ్లకు ఏళ్లు పడుతోంది. ఈ కారణంగా నేరస్థులు దర్జాగా పదవులు అనుభవిస్తున్నారు. ఈ దారుణ పరిస్థితి పోవాలంటే రాజకీయ అవినీతి కేసులను నిర్దిష్ట కాలపరిమితి లోపు పరిష్కరించే విధంగా చట్టం చేయాలి. అందుకు లోక్‌పాల్ మాత్రమే శరణ్యమని నినదించిన అన్నా హజారే మాటలను, డిమాండ్‌ను పాలకులు పక్కన పెట్టారు. వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్నాయన్న విమర్శలు వస్తున్నా మోడీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అయితే రాజకీయంగా మరింతగా బలపడి, అవినీతి పాలకలను పక్కకు తప్పించేందుకు బిజెపి కొత్త ఎత్తుగడలు వేస్తోందని సమాచారం. ఆర్థికపరమైన నేరాలతోపాటు ఇతర క్రిమినల్ కేసుల్లో విచారణ ఎదుర్కొంటున్న రాజకీయుల భరతం పట్టడానికి కేంద్ర ప్రభుత్వం పావులు కదుపుతోందని తెలుస్తోంది. భారతీయ జనతా పార్టీతో అనుబంధం ఉన్న అశ్వనీకుమార్ అనే ఆయన 2015లో సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేశారు. అవినీతి కేసుల్లో సత్వర లేదా నిర్దుష్ట కాలపరిమితిలో విచారణ జరిగేలా ఆదేశాలు ఇవ్వాలనీ ఆయన తన పిటిషన్‌లో కోరారు. జస్టిస్ రంజన్ గొగోయ్ ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడు ఈ పిటిషన్‌పై విచారణలో కదలిక వచ్చింది. తర్వాత ఆయన పదవీ విరమణ చేయడం, ఐదారు నెలలుగా కొవిడ్ కారణంగా ఈ పిటిషన్‌లో కదలిక లేకుండా పోయింది. అయితే ఇటీవలే అశ్వనీకుమార్ తన పిటిషన్‌ను పరిష్కరించవలసిందిగా న్యాయస్థానాన్ని అర్థించారు. ఈ నేపథ్యంలో కేసులు పెండింగులో ఉన్న, విచారణ ఎదుర్కొంటున్న రాజకీయ నాయకులకు సంబంధించి సేకరించిన వివరాలతో కూడిన జాబితాను అమికస్ క్యూరీ సుప్రీంకోర్టుకు సమర్పించింది. జస్టిస్ ఎన్.వి.రమణ నేతృత్వంలోని ధర్మాసనం దీనిపై విచారణ జరిపి కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. రాజకీయ నాయకులపై పెండింగులో ఉన్న కేసులను సత్వరమే విచారించడానికి వీలుగా ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని సుప్రీంకోర్టు ధర్మాసనం కోరింది. నేరారోపణలు ఎదుర్కొంటున్న రాజకీయ నాయకులపై విచారణను ఏడాదిలోగా పూర్తిచేసి జైలుకు పంపాల్సిన వాళ్లను పంపుతామని నరేంద్ర మోదీ అప్పట్లో హామీ ఇచ్చారు. తాజాగా తన పిటిషన్‌పై విచారణ జరపాల్సిందిగా అశ్వనీకుమార్ సుప్రీంకోర్టును కోరడాన్ని బట్టి, నేరారోపణలు ఎదుర్కొంటున్న వారి భరతం పట్టడానికి కేంద్రం సిద్ధపడుతున్నట్టు భావించాల్సి ఉంటుంది. సుప్రీం కూడా తాజాగా నోటీసులు ఇవ్వడంతో ఇప్పుడు దీనిని వినియోగించుకునే అవకాశం ఏర్పడింది. కొవిడ్ కారణంగా దేశ ఆర్థిక పరిస్థితి పూర్తిగా దెబ్బతింది. జీడీపీ పడిపోయింది. పారిశ్రామిక రంగం కుదేలవుతోంది. లక్షల మంది ఉపాధి కోల్పోతున్నారు. ఈ పరిస్థితులను చక్కదిద్దే చిట్కా ఏదీ కేంద ప్రభుత్వం వద్ద లేదు. ఈ పరిస్థితుల్లో వచ్చే ఎన్నికలను ఎదుర్కోవడానికి ప్రధాని నరేంద్ర మోదీకి సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయడానికి కేందప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేయవచ్చని రాజకీయంగా చర్చ సాగుతోంది. గతంలో ప్రకటించినట్టు ఏడాదిలోపు విచారణ పూర్తి కావడానికి చర్యలు తీసుకోవచ్చు. అదే జరిగితే బీజేపీకి చెందిన కొంతమంది నాయకులకు కూడా శిక్ష పడవచ్చు. దీనికి కూడా బిజెపి వెనకాడకపోవచ్చు. సొంతపార్టీ వారినైనా ఉపేక్షించబోమని చెబుతూ..వివిధ రాష్ట్రాల్లో అవినీతి ముద్రపడ్డ మంత్రులు, శాసనసభ్యులు, ఎంపీలపై పెండింగులో ఉన్న కేసుల తుట్టెను కదిపే చాన్స్ ఉంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కూడా జాబితాలో ఉన్నారు. అవినీతి ఆరోపణలకు సంబంధించి ఆయనపై నమోదైన కేసులు దాదాపు పదేళ్లగా పెండింగులో ఉన్నాయి. ఇప్పుడు కేందప్రభుత్వం వైఖరిలో మార్పు వస్తోంది. కేంద్ర ప్రభుత్వ స్పందనను బట్టి రాజకీయాల్లోని నేరస్థులపై విచారణను ఏడాదిలోపు పూర్తి చేయాలని సుప్రీంకోర్టు కూడా ఆదేశించే అవకాశం ఉంది. అదే జరిగితే వచ్చే ఏడాది చివరినాటికి జగన్‌రెడ్డిపై ఉన్న కేసులలో విచారణను పూర్తిచేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో అటు కేంద్రంలో, ఇటు సుప్రీంకోర్టులో ప్రత్యేక కోర్టుల ఏర్పాటు విషయంలో కదలిక వచ్చింది. ఈ పరిణామంతో ఎవరి రాజకీయ భవిష్యత్ మసకబారుతుందో చూడాలి. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై పెండింగ్‌లో ఉన్న కేసులలో కూడా కదలిక వస్తుంది. మొత్తం మీద దేశవ్యాప్తంగా బలమైన నాయకులుగా చలామణి అవుతున్నవారి పరిస్థితి ఇబ్బందికరంగా మారడం ఖాయంగా కనిపిస్తోంది. ప్రత్యేక కోర్టుల వల్ల కొంతమంది నాయకులు తెరమరుగు కావొచ్చు గానీ, రాజకీయాలు ప్రక్షాళన అవుతాయని బిజెపి నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. హత్యానేరం వంటి తీవ్ర అభియోగాలతో పాటు, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు నాయకులు ఇప్పుడు దర్జాగా పదవులు వెలగబెడుతున్నారు. ఈ పరిస్థితికి ఎప్పుడో ఒకప్పుడు ముగింపు పలకాల్సిన అవసరముంది.

బ్యూరోక్రాట్ల అవినీతిపైనా కేంద్రం నిశిత దృష్టి

ప్రత్యేక కోర్టుల పరిధిలోకి వచ్చేలా చేస్తే మంచిదే?

న్యూఢిల్లీ,సెప్టెంబర్14(ఆర్ఎన్ఎ): సుప్రీం కోర్టు జస్టిస్ ఎన్‌వి రమణ నేతృత్వంలో ఏర్పాటు చేసిన అమికస్ క్యూరీలో పనిలో పనిగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐఏఎస్, ఐపీఎస్ వంటి అఖిల భారత సర్వీసు అధికారులను కూడా ఈ ప్రత్యేక కోర్టుల పరిధిలోకి తేవలసిన అవసరముందన్న అభిప్రాయం వస్తోంది. రాజకీయ నాయకుల అవినీతికి వత్తాసు పలికిన బ్యూరోక్రాట్లకు కూడా శిక్షపడితే వ్యవస్థ ప్రక్షాళనం అవుతుందన్న భావన ఉంది. రాజకీయ నాయకులు అవినీతికి పాల్పడటం ద్వారా సంపాదించిన సొమ్ములో కొంతైనా తదుపరి ఎన్నికల్లో మళ్లీ గెలవడం కోసం ఖర్చు చేస్తారు. బ్యూరోక్రాట్లకు ఆ అవసరం కూడా లేదు. రాజకీయ నాయకులపై అవినీతి ఆరోపణలు వస్తే.. వారి రాజకీయ భవిష్యత్ మసకబారుతుంది. అదే బ్యూరోక్రాట్ల విషయంలో తదుపరి చర్యలు పెద్దగా ఉండటం ల

ఆత్మహత్య చేసుకోబోయిన వివాహితను రక్షించిన లేక్‌పోలీసులు

కరంనగర్, సెప్టెంబర్ 14 (నేటినిజ ప్రతినిధి):ఎల్‌యండి రిజర్వాయర్‌లో ఆత్మహత్యాయత్నం చేసుకోబోయిన వివాహితను రక్షించారు లేక్‌పోలీసులు. ఆదివారంనాడు జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

భర్త, అత్త,ఆడపడుచులు తరచూ వేధింపులకు గురిచేస్తుండటంతో భరించలేక జీవితంపై విరక్తి చెందిన రామడుగు మండలం లక్ష్మీగ్రామానికి చెందిన వివాహిత కొండి కవిత(33) ఆదివారంనాడు మధ్యాహ్నం ఎల్‌యండి రిజర్వాయర్ వద్ద ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నిస్తుండగా గస్తీలో ఉన్న లేక్‌పోలీసులు అడ్డుకున్నారు. వివరాలు సేకరించి ఎస్ఐకి సమాచారం అందించారు. తను ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలను పేర్కొంటూ ఆమె రాసిపెట్టుకున్న కారణాలకు సంబంధించిన ప్రతిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సదరు వివాహిత సోదరుడికి సమాచారం అందించి కౌన్సిలింగ్ నిర్వహించిన తర్వాత అప్పగించారు. వివాహితను రక్షించడంలో కీలకపాత్ర పోషించిన ఎస్ఐ శ్రీనాథ్, హెడ్‌కానిస్టేబుల్ ఆర్ మల్లేశం, హోంగార్డు టి మునీందర్‌లను కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి అభినందిస్తూ వారికి రివార్డులను ప్రకటించారు.

ఇప్పటి వరకు 102 మంది ప్రాణాలనురక్షించిన లేక్‌పోలీసులు

2017 అక్టోబర్ 10 నుండి ఈనెల 13 ఆదివారం వరకు మ్యానేర్‌డ్యాం సమీపంలో వివిధయ కారణాలతో ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చిన 102మందిని లేక్‌పోలీసులు రక్షించారని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి తెలిపారు.

2017లో - 05, 2018లో - 20, 2019లో - 54, ఈ సంవత్సరంలో ఇప్పటివరకు 23మందిని రక్షించడం జరిగిందని వివరించారు. మానేరుడ్యాం, ఉజ్వలపార్క్, జింకలపార్క్ సమీపంలో అసాంఘీక కార్యకలాపాలను నియంత్రించడం కోసం ఏర్పాటు చేసిన లేక్‌అవుట్‌పోస్ట్ సత్ఫలితాలను సాధిస్తున్నదని పేర్కొన్నారు. లేక్‌పోలీస్ ఏర్పాటుతో అసాంఘీక కార్యకలాపాలు పూర్తిగా నియంత్రణలోకి వచ్చాయని, ప్రజల్లో ఏర్పడిన భద్రతభావంతో ఉదయం నాలుగుగంటల నుండే మహిళలు ఒంటరిగా నడకకోసం వస్తున్నారని, అసాంఘీక కార్యకలాపాల నియంత్రణలో భాగంగా పైన పేర్కొన్న ప్రాంతాల్లోని పరిస్థితులను పర్యవేక్షించడం, కదలికలను పసిగట్టేందుకు ఇప్పటివరకు 17 సిసి కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజల సహకారంతో మరిన్ని సిసి కెమెరాలను ఏర్పాటు చేయడంతోపాటు భద్రతను మరింత పటిష్టం చేయనున్నామని చెప్పారు.

ఐదుగురు పేకాటరాయుళ్ళ పట్టివేత

కరీంనగర్‌లోని బ్యాంక్‌కాలనీ సమీపంలోని ఉదయ్‌నగర్‌లో ఒక ఇంట్లో పేకాట ఆడుతున్న ఐదుగురుని ఆదివారంనాడు టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వీరివద్దనుండి 25,360రూపాయలన నగదు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఒక ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ విభాగం అధికారులు ఎస్ఐ కరుణాకర్ ఆధ్వర్యంలో దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న కరీంనగర్‌లోని వావిలాలపల్లికి చెందిన గుర్రం మధుసూధన్‌రెడ్డి, బ్యాంక్‌కాలనీకి చెందిన రామగిరి శేఖర్‌రావు, రేకుర్తికి చెందిన భూంపల్లి రాఘవరెడ్డి, ఉదయ్‌నగర్‌కు చెందిన మండల వెంకటేశ్వర్‌రెడ్డి, భగత్‌నగర్‌కు చెందిన పరిపాటి వేణుగోపాల రెడ్డిలను అదుపులోకి తీసుకుని త్రీటౌన్‌లో అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదైంది.

మిషన్ భగీరథకు నోడల్ అధికారి

-పనుల పర్యవేక్షణకు నియామకం

కొత్తగూడెం,సెప్టెంబర్14(ఆర్ఎన్ఎ): జిల్లాలో తాగునీటి పథకాల పర్యవేక్షణకు బుధవారం నుంచి 22వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ ఎంవి రెడ్డి మండల ప్రత్యేక అధికారులు, ఆర్‌డబ్ల్యు ఎస్, మిషన్ భగీరథ, కాంట్రాక్టర్లను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న పనులపై సమగ్ర నివేదికలు అందచేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ పనుల పర్యవేక్షణకు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లను నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లు, ఏఈ, డీఈలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో మిషన్ భగీరథ పనుల నిర్మాణంలో కాంట్రాక్టర్లు, అధికారులు అలసత్వం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నుంచి ప్రతివారం సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని పనుల్లో అలసత్వం వహించే కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెడతామని హుకుం జారీచేశారు. గ్రామపంచాయితీ, ఎంపీడీవో, ఎంపీవోలు పర్యవేక్షణ చేసి దృవీకరణ పత్రం ఇచ్చిన తర్వాతనే బిల్లులు చెల్లింపులు చేయాలని, ఆదేశించారు. జిల్లాలో 1.80లక్షల ఇళ్లకు నీటి కనెక్షన్ ఇవ్వాల్సి ఉండగా 67,420 ఇండ్లకు మాత్రమే పంపు కనెక్షన్‌లు ఇచ్చారని, ఇంకా 50,580 ఇండ్లకు నీటి పంపు కనెక్షన్‌లు ఇవ్వాల్సి ఉందన్నారు.అదనంగా మరో 55,214 ఇండ్లకు పంపు కనెక్షన్ ఇచ్చేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈనెల 25 నాటికి పనులు మొత్తం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈనెల 11న నిర్వహించే సమావేశానికి పూర్తి నివేదికలతో హాజరు కావాలని అధికారులను ఆదేశించారు.

అన్ని భారతీయ భాషలను గౌరవించుకుందాం : ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ,సెప్టెంబర్14,: హిందీ భాషను ప్రోత్సహించాల్సిన అవసరం ఉన్నదని.. అలాగని ఏ భాషనూ ఎవరిపైనా రుద్దాల్సిన అవసరం లేదని, ఏ భాషనైనా వ్యతిరేకించడం సరికాదని ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. 'వివిధ భాషలు, వివిధ ఆచారాలున్నా భారతదేశమంతా ఒక్కటే అని, భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ విశిష్టత' ఈ సాంస్కృతిక గొప్పదనాన్ని కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. హిందీ దివస్ సందర్భంగా మధుబన్ విద్యాసంబంధ ప్రచురణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్ లైన్ సమావేశంలో వెంకయ్యనాయుడు ప్రసంగిస్తూ.. ఎవరి మాతృభాషను వారు నేర్చుకుంటూనే మరో భారతీయ భాషను కూడా నేర్చుకోవాలని సూచించారు. ఎన్ని ఎక్కువ భాషలొస్తే అంత ప్రగతి సాధించేందుకు వీలవుతుందన్నారు. ఇతర భాషలోని పదాలను, సామెతలను నేర్చుకుంటుంటే.. ఆ భాష మాట్లాడే వారితో ప్రేమానురాగాలు పెంచుకోవడంతోపాటు సత్సంబంధాలు ఏర్పడతాయని, దేశ సమైక్యత సుదృఢం అవుతుంది' అని చెప్పారు.

తన విద్యార్థి దశలో హిందీ వ్యతిరేక ఉద్యమాలను చూశానన్న ఉపరాష్ట్రపతి.. ఢిల్లీకి వచ్చిన తర్వాత జాతీయస్థాయిలో ప్రతి ఒక్కరూ ఈ భాషను నేర్చుకోవలసిన ఆవశ్యకతను స్వయంగా గ్రహించానని తెలిపారు. దక్షిణ భారతదేశంలో హిందీ భాష పట్ల గౌరవభావాలున్నాయని.. ప్రాధాన్యత తెలియని కొద్దిమంది మాత్రమే దీన్ని వ్యతిరేకిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మధుబన్ ఎడ్యుకేషనల్ బుక్స్ సంస్థ సీఈవో నవీన్ రజ్లానీ, ఎన్సీఈఆర్టీ సభ్యులు ప్రొఫెసర్ ఉషా శర్మ, ప్రొఫెసర్ పవన్ సుధీర్, ఇంద్రప్రస్థ విశ్వవిద్యాలయ ప్రతినిధి ప్రొఫెసర్ సరోజ్ శర్మతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి హిందీ అధ్యాపకులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

షీటీంల సేవలను సద్వినియోగం చేసుకోవాలి

-మహిళ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ యం సురేందర్

కరంనగర్, సెప్టెంబర్ 14 (నేటినిజ ప్రతినిధి):వివిధ రకాల వేధింపులను ఎదుర్కొనే మహిళలు, విద్యార్థినులు షీటీంల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కరీంనగర్ మహిళ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ యం సురేందర్ అన్నారు. తమకు ఎదురయ్యే ఇబ్బందులను మహిళలు, విద్యార్థినులు మౌనంతో భరించకూడదని చెప్పారు.

కమిషనరేట్ పోలీసులు మహిళలు భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. మహిళలు, విద్యార్థుల నుండి అందే ఫిర్యాదులపై సత్వరం స్పందించి పరిష్కరిస్తామని చెప్పారు. మహిళలు, విద్యార్థినులు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదుచేయాల్సిన అవసరం లేదని, వాట్సాప్, సెల్‌ఫోన్, హాక్‌ఐయాప్‌ల ద్వారా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. అన్నివర్గాల ప్రజల సౌకర్యార్థం పోలీస్‌శాఖ అందుబాటులోకి తీసుకవచ్చిన హాక్ ఐ యాప్‌ను స్మార్ట్‌ఫోన్ కలిగిఉన్న ప్రతిపౌరుడు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. షీబృందాలకు చెందిన సభ్యులు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ హాక్ఐ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించాలని చెప్పారు. ఈయాప్‌లోయ మహిళల భద్రతకోసం ప్రత్యేక సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. ఎక్కువరద్దీ, పోకిరీలు ఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి ఆయాప్రాంతాల్లో వారి ఆగడాలను నియంత్రించేందుకు మఫ్టీలో పోలీసులతో నిఘా కొనసాగిస్తున్నామని చెప్పారు. పోకిరీలను ఆధారాలతో పట్టుకునేందుకు ఆధునికసాంకేతిక పరికరాలను వినియోగిస్తున్నామని తెలిపారు.

యాదాద్రి ఏరియల్ వ్యూ విడుదల

-కెసిఆర్ పర్యటనతో అద్భుతంగా చిత్రీకరణ

హైదరాబాద్,సెప్టెంబర్14(ఆర్ఎన్ఎ): యాదాద్రి ఏరియల్ వ్యూ డెవలప్‌మెంట్ దృశ్యాలను యాదాద్రి టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ విడుదల చేసింది. వీడియోలో ఆలయ నిర్మాణం రహదారులు అద్భుతంగా ఉన్నాయి. సీఎం కేసీఆర్ ఆదివారం యాదాద్రిని సందర్శించిన తర్వాత ఏరియల్ వ్యూ రివ్యూను విడుదల చేశారు. యాదాద్రి ఆలయానికి రింగ్ రోడ్ సుందరీకరణ ఒక మణిహారంలా తీర్చి దిద్దాలని సీఎం కేసీఆర్ సూచించారు. పచ్చని చెట్లు, వీధిదీపాలతో వాకింగ్, సైక్లింగ్ షాట్‌లతో రింగ్ రోడ్డును అత్యంత సుందరంగా తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంతమంది భక్తులు వచ్చినా వారికి సౌకర్యాలు కల్పించే విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయానికి ఆనుకుని ఉన్న గండిపేట చెరువును ప్రతి రెండు నెలలకు ఒకసారి కాళేశ్వరం జలాలతో నింపాలని ఆదేశించారు. తెలంగాణకు తలమానికమైన అత్యద్భుతమైన ఆధ్యాత్మిక పంచనారసింహ క్షేత్రం.. ఆరు రాజగోపురాలు.. దివ్యవిమానం.. అష్టభుజ ప్రాకార మంటపాలు.. భక్తిభావం ఉట్టిపడేలా కృష్ణశిలల విగ్రహాలు.. బంగారు వర్ణంలో అద్దాల మంటపం.. చెప్పుకుంటూపోతే యాదాద్రి ఆలయ విశిష్టతలు ఎన్నెన్నో ఉన్నాయి. రూ.1200 కోట్లతో సీఎం కేసీఆర్ చేపట్టిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు తుదిదశకు చేరుకున్నది. ఇప్పటికే దాదాపు 90శాతం పనులు కాగా, మిగతా పనులు త్వరగా పూర్తిచేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. యాదాద్రి వెయ్యేండ్లపాటు నిలవాల్సిన గొప్ప నిర్మాణం. సంప్రదాయ, ఆగమశాస్త్ర నియమాలు పాటిస్తూ తొందరపాటు లేకుండా ఆలయ పునర్నిర్మాణ పనులను పూర్తిచేయాలన్నారు. రాబోయే రోజుల్లో పెద్దఎత్తున తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా సౌకర్యాల కల్పనలో ప్రత్యేక శ్రద్ధ తీసు కోవాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. ఆది వారం యాదగిరిగుట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్న సీఎం.. ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. ఆలయ నిర్మాణ పనులను పరిశీలించి గండి చెరువును కాళేశ్వరం జలాలతో నింపాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం టెంపుల్‌సిటీలో చేపడుతున్న 365 వనతిగృహాల నిర్మాణాన్ని వేగంగా పూర్తిచేయాలని, మరో 200 ఎకరాల్లో కాటేజీల నిర్మాణానికి ఏర్పాటుచేయాలని సూచించారు. ఆలయం ఆసాంతం బంగారం, వెండి ధగధగలతో మెరవాలని, ఆలయ రాజగోపురం ప్రధాన ద్వారాలకు బంగారు తాపడంచేసేందుకు నిపుణులైన స్వర్ణకారులను పిలిపించాలని ఆలయ స్థపతులకు, ఆర్కిటెక్ట్ అధికారులకు సూచనలు చేశారు. ఆలయంలో ఏర్పాటు చేసిన అద్దాల మంట పం, ఆలయం మొత్తం విద్యుద్దీపాల అలంకరణతో మెరిసేలా చేపట్టనున్న నూతన లైటింగ్ విధానాన్ని ప్రొజెక్టర్ ద్వారా 5 నిమిషాలపాటు వీక్షించారు. వీటిన్నిటితో పాటు సిఎం కెసిఆర్ పర్యటనతో కూడిన వీడియోను విడుదల చేశారు.

వూహాన్ ల్యాబ్‌లోనే కరోనా ఉత్పత్తి

పునరుద్ఘాటించిన హాంగ్‌కాంగ్ వైరాలజిస్ట్

న్యూయార్క్,సెప్టెంబర్14(ఆర్ఎన్ఎ): ప్రపంచాన్ని వణికిస్తోన్న కరోనా వైరస్ మహమ్మారి చైనా ప్రభుత్వ ఆధ్వర్యంలోని వూహాన్ ల్యాబ్‌లో తయారైందని మరోమారు ఆరోపణలు వెల్లువెత్తాయి. హాంకాంగ్‌కు చెందిన ప్రముఖ వైరాలజిస్టు డా. లి మెంగ్ యాన్ మరోమారు తన ఆరోపణలను పునరుద్ఘాటించారు. తన వాదనలను బలపర్చేందుకు తగిన శాస్త్రీయ ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. హాంకాంగ్‌కు చెందిన ప్రముఖ శాస్త్రవేత్తలలో ఒకరైన లి మెంగ్ కరోనా వైరస్ వ్యాప్తికి చైనా ప్రభుత్వమే కారణమని మొదటినుంచి చెబుతూనే ఉన్నారు. కరోనా వైరస్ వ్యాప్తి చెందుతుందన్న సంగతి ప్రభుత్వానికి ముందే తెలుసునని ఆమె అన్నారు. పలు భద్రతా కారణాల దృష్ట్యా ఆమె హాంకాంగ్‌నుంచి అమెరికాకు తరలివచ్చేశారు. సెప్టెంబర్ 11న ఓ షోలో ఆమె మాట్లాడుతూ కరోనా వైరస్‌పై చేసిన పరిశోధనలు.. తాను ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్లను పంచుకుంది. ఆమె మాట్లాడుతూ.. నేను కరోనా వైరస్‌పై రెండు పరిశోధనలను చేశాను. దాని ఫలితాలను మా ఉన్నతాధికారితో పంచుకున్నాను. డబ్ల్యూహెచ్‌ఓతో సంబంధాలు ఉన్న ఆయన చైనా గవర్నమెంట్ తరపున, డబ్ల్యూహెచ్‌ఓ తరపున ప్రజలకు మంచి జరిగేలా చేస్తారని అనుకున్నాను. కానీ, నన్ను నిశ్శబ్దంగా ఉండమని, లేకపోతే ఎవ్వరికీ కనిపించకుండా పోతావని అన్నారు. కానీ, దీని గురించి బయటకు చెప్పకుండా ఉండలేకపోయాను. ఈ విషయాన్ని ప్రపంచానికి చెప్పకపోతే నన్ను నేను క్షమించు కోలేననిపించింది. అందుకే జనవరి 17న అమెరికాలోని ప్రముఖ చైనీస్ యూట్యూబ్ ఛానల్‌ను సంప్రదించాను. మొదటిసారి కోవిడ్ సంగతులను వారితో పంచుకున్నానని తెలిపింది

40లక్షల మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణం

-అసెంబ్లీలో సభ్యుల ప్రశ్నలకు మంత్రి సమాధానం

హైదరాబాద్,సెప్టెంబర్14(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో 40 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాములను నిర్మించేందుకు ప్రతిపాదన ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి తెలిపారు. గోదాముల నిర్మాణంతో ఇప్పటికే కార్యాక్రమాలు చేపట్టామని అన్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా గోదాముల నిర్మాణానికి సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు.

రాష్ట్ర ఏర్పాటుకు ముందు 4 లక్షల 17 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో 176 గోదాములు ఉండేవని మంత్రి గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత నాబార్డు సహాయంతో 17 లక్షల 20 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో 452 గోదాములు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ఏడాది వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతున్నాయి. దీనకనుగుణంగా గోదాములు నిర్మించేందుకు ప్రభుత్వం ముందుకెళ్తుందని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటికీ 60 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాములు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వరికి తప్ప ఇతర పంటలకు గోదాముల అవశ్యకత ఉంది. కాబట్టి 40 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాములను నిర్మించబోతున్నాం. ఈ గోదాములకు అవసరమైన భూములను ముందుగానే సేకరించాలని సీఎస్ తో పాటు కలెక్టర్లకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే భూములను సేకరించాం. ఎక్కడా ఇబ్బంది లేదన్నారు. గ్రామీణ నియోజకవర్గ ప్రాంతాల్లో 40 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాములను నిర్మించబోతున్నాం. నాబార్డు సహాయంతో వీలైనంత త్వరగా గోదాములను ఏర్పాటు చేస్తాం.. నూతనంగా ఏర్పడిన మండలాలతో పాటు గతంలో ఉన్న మండలాల్లో ఎక్కడైతే గోదాములు లేవో అక్కడ నిర్మాణం మొదటి దశలోనే చేపడుతామని మంత్రి నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు.

నిత్యావసర వస్తువుల సవరణ బిల్లుకు లోక్‌సభ

వ్యతిరేకించిన కాంగ్రెస్ సభ్యులు

న్యూఢిల్లీ,సెప్టెంబర్14(ఆర్ఎన్ఎ): నిత్యావసర వస్తువుల సవరణ బిల్లు 2020కి లోక్‌సభ ఆమోదించింది. కాంగ్రెస్ పార్టీ అధీర్ రంజన్ చౌదరి ఈ బిల్లును వ్యతిరేకించగా.. అది సహకార సమాఖ్య సూత్రాలకు వ్యతిరేకమని, ఇది కేవలం హోర్డింగ్‌ను పెంచుతుందని ఆ పార్టీ ఎంపీ గౌరవ్ గొగోయ్ అన్నారు.

రైతులు లాక్‌డౌన్ భారాన్ని మోస్తున్నందున ఆర్డినెన్స్ అవసర మని, ఆరుగురు ముఖ్యమంత్రులతో కూడిన హై పవర్ కమిటీ ఆమోదం పొందిన తర్వా త ఆర్డినెన్స్ తీసుకువచ్చారని వినియోగదా రుల వ్యవహారాలశాఖ మంత్రి సాహెబ్ దాన్వే తెలిపారు. అనంతరం బిల్లుకు లోక్‌సభ ఆమోదముద్ర వేసింది. అంతకు ముందు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బ్యాంకింగ్ రెగ్యులేషన్ (సవరణ) బిల్లు-2020ని ఉపసంహరిం చుకునే సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని ఎన్‌కే ప్రేమచంద్రన్ వ్యతిరేకించారు. బిల్లు బ్జడెట్ సెషన్‌లో ఆమోదం పొందలేకపోయిందని, తర్వాత ఆర్డినెన్స్ తీసుకువచ్చారన్నారు. అధికార దుర్వినియోగంపై స్పష్టమైన కేసు ఉంద న్నారు. తీవ్ర ఒత్తిడికి గురైన సహకార బ్యా ంకులను కాపాడేందుకు ఆర్డినెన్స్ తీసుకొ చ్చినట్లు ఆర్థిక మంత్రి సీతారామన్ తెలిపా రు. తాజాగా బిల్లు తీసుకువస్తో0దని, ఇది ఉపసంహరించబడుతున్న బిల్లులోని నిబం ధనలను కలిగి ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం వాయిస్ ఓటింగ్ ద్వారా బిల్లును ఉపసంహరించుకున్నారు. ఇదిలావుంటే తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సౌగత్ రాయ్.. లోక్‌సభలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యలను పార్లమెంటరీ వ్యవ హారల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తప్పుప ట్టారు. వ్యక్తిగతంగా ఒకరి వేషధారణపై కామెంట్లు చేయడం సరికాదన్నారు. సీనియర్ సభ్యుడై ఉండి.. మీరేమి మాట్లాడుతున్నారో తెలుసా అని మంత్రి జోషి టీఎంసీ ఎంపీపై ÷ర్ అయ్యారు. బేషరతుగా క్షమాపణలు చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. ఎంపీ సౌగత్ రాయ్ మహిళలను కించపరిచారం టూ ఆరోపించారు. అయితే టీఎంసీ ఎంపీ చేసిన వ్యాఖ్యలను సభ రికార్డుల నుంచి తొలగించారు.

ఆ రాష్ట్రాల్లోనే ఎక్కువ కేసులు: కేంద్రమంత్రి

న్యూఢిల్లీ,సెప్టెంబర్14(ఆర్ఎన్ఎ): కరోనా కేసులు అత్యధికంగా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, బీహార్, తెలంగాణ, ఒడిశా, అస్సాం, కేరళ, గుజరాత్‌లోనే నిర్ధారణ అయ్యాయని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ లోక్‌సభకు తెలిపారు. కరోనాపై చర్చ సందర్భంగా ఆయా రాష్ట్రాల్లో్ల లక్షకుపైగా పాజిటివ్ కేసులు నిర్ధారణ అయ్యాయని చెప్పారు. కేంద్రం తీసుకుంటున్న చర్యలతో దేశంలో మిలియన్ జనాభాకు 3,328 కేసులు నిర్ధారణ అవుతున్నాయని, అలాగే మిలియన్‌కు 55 మరణాలకు మాత్రమే పరిమితం చేయగలిగామన్నారు. కరోనా మరణాల రేటు 1.6శాతం మాత్రమే ఉందని, బాధిత దేశాలతో పోలిస్తే ప్రపంచంలో అతి తక్కువ సంఖ్యలో ఉందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించడం వల్ల కరోనా ఉధృతిని నిరోధించడంలో సహాయపడిందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. వైరస్ ప్రబలినప్పటి నుంచి దవాఖానల్లో 36.3 రెట్లు బెడ్లు, 24.6 రెట్లు ఐసీయూ బెడ్స్ పెరిగాయని తెలిపారు. వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి లాక్‌డౌన్‌కు ముందు ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. కరోనా వైరస్ వ్యాప్తిని విజయవంతంగా నిర్వహించినందుకు ప్రధాని మోదీని మంత్రి ప్రశంసించడంపై వివక్షాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.

రమేశ్ ఆస్పత్రిపై విచారణకు ఓకే

హైకోర్టు విధించిన స్టే ఎత్తివేసిన సుప్రీం

న్యూఢిల్లీ,సెప్టెంబర్14(ఆర్ఎన్ఎ): పదిమంది కరోనా బాధితుల మృతికి కారణమైన విజయవాడ రమేష్ ఆస్పత్రిపై చర్యలు తీసుకునేందుకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. స్వర్ణ ప్యాలెస్ ఘటనలో రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తు చేపట్టవచ్చని స్పష్టం చేసింది. ఈ మేరకు ఏపీ హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ప్రమాద కారకులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం జస్టిస్ నారీమన్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఏపీ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపిస్తూ.. దర్యాప్తుపై ఏకపక్షంగా నిషేధం విధించడం సరికాదన్నారు. ఆస్పత్రి నిర్లక్ష్యం వల్ల 10 మంది కరోనా పేషెంట్లు చనిపోయారని వివరించారు. రమేష్ ఆస్పత్రి యాజమాన్యం దర్యాప్తునకు సహకరించడం లేదని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దర్యాప్తు సాగే విధంగా హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించాలని న్యాయవాది వాదించారు. పిటిషనర్ వాదనతో ఏకీభవించిన న్యాయస్థానం.. ఏపీ ప్రభుత్వానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. డాక్టర్ రమేష్ కేసులో విచారణ జరపొచ్చని తెలిపింది. దర్యాప్తునకు డా.రమేష్ పూర్తిగా సహకరించాలని ఆదేశించింది. అయితే రమేష్ అరెస్ట్‌పై సాక్ష్యాల ఆధారంగా హైకోర్టు నిర్ణయం తీసుకోవచ్చిన ధర్మాసనం అభిప్రాయపడింది. కాగా రమేష్ ఆస్పత్రి యజమాని డాక్టర్ రమేష్ ప్రమాదం జరిగినప్పటి నుంచి పరారీలో ఉన్న సంగతి తెలిసిందే. హైకోర్టు ఆయనకు, మరో డైరెక్టర్ సీతా రామ్మోహన్ రావులను అరెస్టు చేయకుండా స్టే ఇచ్చింది. దీనిని సవాలు చేస్తూ గత గురువారం ఏపీ సర్కార్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. తాజా సుప్రీంకోర్టు నిర్ణయంతో ఏపీ పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. దోషులను కోర్టు నిలబెట్టే విధంగా విచారణ జరుపనున్నారు.

తిరుమలలో టిక్కెట్ల పేరుతో మోసాలు

భక్తులు అప్రమత్తంగా ఉండాలని టిటిడి హెచ్చరిక

తిరుమల,సెప్టెంబర్14(ఆర్ఎన్ఎ): తిరుమల శ్రీవారి వస్త్రం, అభిషేకం, సుప్రభాత సేవ టికెట్లు ఇప్పిస్తామని కొందరు దళారులు భక్తులను మోసగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని టీటీడీ నిఘా విభాగం, భద్రతా విభాగం ఒక ప్రకటనలో తెలిపింది. కొవిడ్-19 వ్యాప్తి నివారణ చర్యల్లో భాగంగా తిరుమలలో ప్రస్తుతం ఎలాంటి ఆర్జిత సేవా టికెట్లు ఇవ్వడం లేదని స్పష్టం చేసింది. తిరుమలకు సంబంధించిన సేవా టికెట్లు అధికారిక వెబ్‌సైట్ బి తి స్ బ్రా జీ బితిశిజ్గీ÷జీతీతి.జూ.ణనీల.తిని ద్వారా మాత్రమే పొందే అవకాశం ఉందని టీటీడీ నిఘా, భద్రత విభాగం ప్రకటించింది. ఆర్జిత సేవల పునరుద్ధరణ అనంతరం ఆన్‌లైన్‌లో సేవా టికెట్లు లభించని భక్తులకు తిరుమలలో లక్కీ డిప్ ద్వారా మాత్రమే టికెట్లు పొందే అవకాశం ఉందన్నారు. భక్తులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని విజ్ఞప్తి చేసింది. భక్తులను మోసాగించే దళారుల మీద చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చింది.

కోల్‌కతాలో మెట్రో సేవలు పునఃప్రారంభం

కోల్‌కత,సెప్టెంబర్14(ఆర్ఎన్ఎ): అన్‌లాక్ ప్రక్రియ మొదలు కావడంతో దేశవ్‌ఆయప్తంగా వివిధ నగరాల్లో మెట్రో రైలు సేవలు మొదలవుతున్నాయి. కరోనా మహమ్మారి నేపథ్యంలో ఐదు నెలల అనంతరం కోల్‌కతా మెట్రో రైలు సేవలు సోమవారం తిరిగి ప్రారంభమయ్యాయి. కాగా నీట్ అభ్యర్థుల కోసం ఆదివారం నాడు ప్రత్యేక మెట్రో రైళ్లను నడిపారు. తిరిగి ఉదయం 8 గంటలకు మెట్రో రైలు సేవలు ప్రారంభమయ్యాయి. మొదటి రెండు గంటల్లో 3 వ

దేశాభివృద్ధిలో ఇంజనీర్లు పాత్ర అమోఘం

(15 సెప్టెంబర్ 'జాతీయ ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా)

దేశ సమగ్రాభివృద్ధిలో ఇంజనీర్లు ప్రధాన భూమిక నిర్వహిస్తారని, వారి శాస్త్రసాంకేతిక నైపుణ్యాలను సకల మానవాళి ఆర్థిక సామాజిక సంక్షేమానికి ధారపోస్తారని మనందరికి తెలుసు. దేశానికే గర్వకారణమైన ఆదర్శ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినం సందర్భంగా ప్రతియేట 15 సెప్టెంబర్ రోజున 'జాతీయ ఇంజనీర్ల దినోత్సవం' పాటించడం జరుగుతుంది. జాతీయ ఇంజనీర్ల దినం సందర్భంగా అత్యంత ప్రతిభ కనబర్చిన ఇంజనీర్లను సన్మానించడం, ఇంజనీర్ల పాత్రను అవగాహన చేసుకోవట గుర్తించడం, జాతీయాభివృద్ధిలో చేపట్టవలసిన ఇంజనీరింగ్ నిర్మాణాల పట్ల చర్చలు చేయడం లాంటి క్రార్యక్రమాలు చేపట్టవచ్చు. 15 సెప్టెంబర్ 1861 రోజున ముద్దెనహల్లి, చికబల్లాపూర్, కర్నాటకలో జన్మించిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య చదువుల్లో రాణిస్తూ మద్రాస్ విశ్వవిద్యాలయం నుండి సివిల్ ఇంజనీరింగ్‌లో బిఏ డిగ్రీ పూర్తిచేసిన పిదప 1885లో బొంబాయ్ ప్రభుత్వ పబ్లిక్ వర్క్స్ విభాగంలో సివిల్ ఏతేగా నాసిక్, ధూలే మరియు పూనెలలో ఉద్యోగం చేరారు. 1896లో పదోన్నతితో ఈతేగా సూరత్ మరియు పూనెలో విధులు నిర్వహించారు. నీటిపారుదల, సానిటరీ ఇంజనీరుగా బొంబాయిలో సేవలందించారు. 1898లో చైనా మరియు జపాన్ సందర్శనంతో పలు సాంకేతిక అనుభవాలు పొందారు. 1909లో బ్రిటీష్ ప్రభుత్వ సర్వీసు నుండి పదవీవిరమణ పొంది, మైసూర్ ప్రభుత్వ సెక్రెటరీగా, దీవాన్ ఆఫ్ మైసూర్‌గా, టాటా స్టీల్ బోర్డులో డైరెక్టర్‌గా 1955 వరకు సేవలు అందించారు.

సివిల్ ఇంజనీరుగా, ఆర్థిక వేత్తగా, నీటి యాజమాన్య నిపుణుడిగా, డ్యాముల నిర్మాతగా, స్టేట్స్ మెన్‌గా బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించి దేశాభివృద్ధికి బీజాలు వేశారు. 1912 నుండి 1918 వరకు 19వ 'మైసూర్ దివాన్'గా విధులను నిర్వహించి మైసూర్‌ను ఆదర్శ రాష్ట్రంగా సమగ్రాభివృద్ధి పరిచి 'ఫాదర్ ఆఫ్ మాడ్రన్ మైసూర్'గా పేరొందారు. ఆసియాలోని అతి పెద్దదైన కృష్ణ రాజ సాగర్ డ్యామ్‌ను మైసూర్‌లో నిర్మించారు. 1909లో హైదరాబాద్ వరద ప్రమాదాన్ని ఎదుర్కొన్న దశలో ప్రత్యేక కన్సల్టెంట్ ఇంజనీరుగా నేటి మహానగరానికి మూసీనది వరద నియంత్రణ వ్యవస్థలో భాగంగా హుసేన్‌సాగర్ డ్యామ్‌తో పాటు పలు సివిల్ నిర్మాణాలకు ఆద్యుడైనాడు. విశాఖపట్టణం సముద్ర కోతకు గురికాకుండా తన ఇంజనీరింగ్ ప్రతిభతో అడ్డుకోవడమే కాకుండా తిరుపతి తిరుమల రోడ్డు నిర్మాణానికి అమూల్య ఇంజనీరింగ్ సూచనలు చేశారు. నీటిపారుదలలో సరికొత్త 'బ్లాక్ సిస్టమ్' ప్రవేశపెట్టారు. 1903లో పూనె వద్ద కడక్‌వాస్లా డ్యామ్‌కు మె?దటిసారి ఆటోమాటిక్ గేట్లు, ఫ్లడ్ గేట్లు అమర్చిన ఘనత వారిది. 1955లో భారత అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' పొందిన (జవహర్‌లాల్ నెహ్రూతో పాటు) విశ్వేశ్వరయ్య కింగ్ జార్జి-ఎ చేత 'నైట్ వుడ్' స్వీకరించి 'సర్' అనే గౌరవ నామాన్ని అందుకున్నారు. గ్వాలియర్‌లో టైగ్రా డ్యామ్, బీహార్‌లో మోకమ వారధి, మైసూర్ సోప్ ఫాక్టరీ, మైసూర్ ఐరన్ అండ్ స్టీల్ వర్క్స్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ మైసూర్, బెంగళూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం, బెంగుళూరు పాలిటెక్నిక్, మైసూర్ చాంబర్ ఆఫ్ కామర్స్, విశ్వేశ్వరయ్య యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, బెంగుళూరు ప్రెస్, కన్నడ పరిషత్ లాంటి అనేక సంస్థలను ప్రారంభించటంలో భాగస్వాములైనారు. ఎనిమిది విశ్వవిద్యాలయాల నుండి గౌరవ డాక్టరేట్లు, లండన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ సభ్యత్వం, బెంగుళూరు ఐఐయస్సీ ఫెల్లోషిప్, గూగుల్ డూడుల్ గౌరవాలను స్వంతం చేసుకున్నారు. విశ్వేశ్వరయ్య ప్రతిభను గుర్తించిన ఉన్నత సాంకేతిక విద్య వ్యవస్థ బాధ్యులు అనేక ఇంజనీరింగ్ కళాశాలలు మరియు రెండు మెట్రో స్టేషన్లకు తన పేరును పెట్టుకొని స్ఫూర్తిని పొందుట జరుగుతోంది. అపార ఇంజనీరింగ్ ప్రతిభను స్వంతం చేసుకున్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 14 ఏప్రిల్ 1962లో కన్ను మూశారు.

ప్రపంచంలోనే అతి పెద్ద బహుళ దశల మరియు బహుళ ప్రయోజక సాగునీటి ప్రాజెక్టుగా కాళేశ్వరరావు ప్రాజెక్టుకు పేరుంది. తెలంగాణలో 45 లక్షల ఎకరాలకు సాగు మరియు తాగునీరందించగల కాళేశ్వరరావు ప్రాజెక్టును గోదావరి నదిపై రూ. 80,000 కోట్లు వెచ్చించి ఇంజనీరింగ్ అద్భుతాన్ని నిర్మించడమ జరిగింది. ఈ ప్రాజెక్టులో భాగంగా 3 బ్యారేజీలు, 20 లిఫ్టులు, 19 రిజర్వాయర్లు, 19 పంపు హౌజులతో 145 టియంసీల నీటిని 40 మెగావాట్ల సామర్థ్యంగల 43 యంత్రాలు నీటిని ఎత్తి పోస్తూ 203 కిమీ టనల్స్ ద్వారా 1,531 కిమీ దూరం కాలువల ద్వారా నీటిని సరఫరా చేయడం ఒక ఇంజనీరింగ్ అద్భుతంగా పేరొందింది. ప్రపంచంలో అతి పెద్ద అండర్‌గ్రౌండ్ పంపుహౌజ్‌తో 330 మీటర్ల ఎత్తుకు నీటిని పంపుచేసే 139 మెగావాట్ల సామర్థ్యంగల ఐదు బాహుబలి పంపులతో రోజుకు ఒక్కొక్కటి 2 టియంసీల నీటిని ఎత్తి పోయగలవనేది నమ్మలేని ఇంజనీరింగ్ నిజంగా మన ముందు నిలిచింది. దీనితో పాటు ఆంధ్రలో మరో ఇంజనీరింగ్ అద్భుతంగా ప్రతిష్టాత్మక పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఉంది. అనేక సంవత్సరాలుగా నాగార్జునసాగర్, శ్రీశైలం, యస్ఆర్‌యస్పీ, యల్‌యండీ లాంటి పలు ఇంజనీరింగ్ నిర్మాణాలు రెండు రాష్ట్రాలను సస్యశ్యామలం చేస్తూనే ఉన్నాయి. జాతీయ అంతర్జాతీయంగా ఇంజనీర్ల అవిరళ కృషితో అనేక జీవనాధార ప్రాజెక్టులు మానవాళి సంక్షేమానికి నిరంతరం శ్రమ చేస్తున్నారు. ఇలాంటి ఇంజనీర్లకు మార్గదర్శిగా నిలిచిన విశ్వేశ్వరయ్య భారతీయులందరికీ మార్గదర్శి మరియు పూజ్యనీయుడు. అంకితభావం, సమయపాలన మరియు సామాన్య జీవన విధానానికి పెట్టింది పేరుగా సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆదర్శవంతమైన మరియు అనుసరణీయమైన జీవనశైలిని ప్రదర్శించారు.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

కెసిఆర్ కిట్‌తో పెరిగిన ప్రసవాల సంఖ్య

పథకం అమల్లోకి వచ్చిన తర్వాత 50 శాతానికి పెరుగుదల
అసెంబ్లీలో సభ్యుల ప్రశ్నలకు మంత్రి ఈటెల సమాధానం

హైదరాబాద్,సెప్టెంబర్14(ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్ పథకంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగిందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ వెల్లడించారు. కేసీఆర్ కిట్ పథకం అమల్లోకి వచ్చిన తర్వాత 50 శాతానికి పెరిగాయన్నారు.

సీజేరియన్లు కూడా తగ్గాయని మంత్రి వివరించారు. శిశు మరణాల సంఖ్య కూడా తగ్గిందన్నారు. ఆరోగ్య తెలంగాణను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా కేసీఆర్ కిట్ పథకంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. కేసీఆర్ కిట్ పథకం ద్వారా ఇప్పటి వరకు 11,91,275 మంది కుటుంబాలు లబ్ది పొందినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగుల అవసరాలను తీర్చడానికి పునరుద్ధరణ చర్యలు చేపట్టడంతో పాటు మౌలిక వసతులు కల్పించామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులను క్రమక్రమంగా బలోపేతం చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. అవసరమైన చోట అదనపు డాక్టర్లు, సిబ్బందిని నియమిస్తున్నామని తెలిపారు. గర్భిణి ఆరోగ్య పరిస్థితిని బట్టి ఆయా ఆస్పత్రులకు పంపి డెలివరీలు చేస్తున్నారని పేర్కొన్నారు. గర్భిణిల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు ఆశా వర్కర్లు పరిశీలిస్తున్నారని చెప్పారు. కేసీఆర్ కిట్ పథకాన్ని కేంద్రం కూడా ప్రశంసించిందని గుర్తు చేశారు. గతంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 30 శాతం మాత్రమే డెలివరీలు అయ్యేవన్నారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రులను క్రమక్రమంగా బలోపేతం చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. కేసీఆర్ కిట్ పథకంపై సభ్యులు శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. అవసరమైన చోట అదనపు డాక్టర్లు, సిబ్బందని నియమిస్తున్నామని తెలిపారు. కేసీఆర్ కిట్ పథకం ద్వారా ఇప్పటి వరకు 11,91,275 మంది కుటుంబాలు లబ్ది పొందినట్లు ఆయన పేర్కొన్నారు. గర్భిణిల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు ఆశా వర్కర్లు పరిశీలిస్తున్నారని చెప్పారు. శిశు మరణాల సంఖ్య కూడా తగ్గిందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగుల అవసరాలను తీర్చడానికి పునరుద్ధరణ చర్యలు చేపట్టడంతో పాటు మౌలిక వసతులు కల్పించామన్నారు. కేసీఆర్ కిట్ పథకం అమల్లోకి వచ్చిన తర్వాత 50 శాతానికి పెరిగాయన్నారు. గర్భిణి ఆరోగ్య పరిస్థితిని బట్టి ఆయా ఆస్పత్రులకు పంపి డెలివరీలు చేస్తున్నారని పేర్కొన్నారు. సీజేరియన్లు కూడా తగ్గాయని మంత్రి వివరించారు. కేసీఆర్ కిట్ పథకాన్ని కేంద్రం కూడా ప్రశంసించిందని గుర్తు చేశారు. గతంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 30 శాతం మాత్రమే డెలివరీలు అయ్యేవి. ఆరోగ్య తెలంగాణను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

మండలిలోనూ రెవెన్యూ చట్టానికి ఆమోదం

బిల్లుకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన సభ్యులు
సభ్యుల అనుమానాలకు సిఎం కెసిఆర్ వివరణ
బిల్లు ఆమోదంతో సభ మంగళవారానికి వాయిదా

హైదరాబాద్,సెప్టెంబర్14(ఆర్ఎన్ఎ): ఇప్పటికే శాసనభ ఆమోదించిన కొత్త రెవెన్యూ బిల్లుకు శాసనమండలి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కొత్త రెవెన్యూ బిల్లును సీఎం కేసీఆర్.. సోమవారం మండలిలో ప్రవేశపెట్టి చర్చను ప్రారంభించారు. సభ్యులు లేవనెత్తిన సందేహాలకు సీఎం కేసీఆర్ వివరణ ఇచ్చారు. అనంతరం ఈ బిల్లును ఆమోదిస్తున్నట్లు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. నూతన రెవెన్యూ బిల్లుతో పాటు వీఆర్వో పోస్టుల రద్దు బిల్లుకు, తెలంగాణ మున్సిపల్ నిబంధన సవరణ బిల్లుకు, తెలంగాణ పంచాయతీరాజ్ సవరణ బిల్లుకు మండలి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. అనంతరం మండలిని మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో సిఎం కెసిఆర్ మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి కార్యక్రమం వట్టిదే.. జోక్ అని సీఎం కేసీఆర్ తెలిపారు.భూ సమస్యల పరిష్కారం విషయంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చెప్పింది వట్టిదే.. అది కాలేదు.. భూభారతి అనే ప్రోగ్రాం పెట్టింది.. వట్టిదే జోక్ అని తెలిపారు. అది ఎక్కడా విజయవంతం కాలేదు. పదిహేను ఏండ్ల కింద పెట్టిండ్రు.. అది కూడా నిజామాబాద్‌లో చేసిండ్రు కానీ విజయ వంతం కాలేదన్నారు. తదనంతరం అరాచకాలు విజృంభించిపోయాయి. పేదల హక్కులను కాపాడేందుకు తమ ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఎవరూ చేయని సాహసాన్ని తాము చేస్తున్నామని తెలిపారు. సమగ్ర భూ సర్వేతో సమస్యలన్నీ పరిష్కారం అవుతాయన్నారు. ఆధునాతనమైన టెక్నాలజీతో సర్వే చేయబోతున్నాం.

ఈ సర్వే పూర్తిగా పారదర్శకంగా ఉంటుందని సీఎం స్పష్టం చేశారు. అతి తక్కువ సమయంలోనే భూ సర్వే పూర్తి చేస్తామని చెప్పారు. సమగ్ర భూ సర్వే జిల్లాకొక ఏజెన్సీకి ఇచ్చే అవకాశం ఉందన్నారు. సమగ్ర సర్వే చేసి కన్‌క్లూజివ్ టైటిల్ ఇచ్చే ప్రయత్నం చేస్తామని సీఎం పేర్కొన్నారు.

కన్‌క్లూజివ్ టైటిల్ ఇస్తే ప్రభుత్వానికి బాధ్యత ఉంటుందన్నారు. కన్‌క్లూజివ్ టైటిల్ ఇచ్చే సత్తా ప్రభుత్వానికి రావాలని కోరుకుంటున్నామని కేసీఆర్ తెలిపారు. తెలంగాణలోని ప్రతి రైతు రక్షణెళి తమ ధ్యేయమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పట్టాదారు పాసుపుస్తకంలో అనుభవదారు కాలమ్ పెట్టేదే లేదని సీఎం తేల్చిచెప్పారు. రైతుల రక్షణ కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామని.. ఇది తమ పార్టీ పాలసీ కూడా అని స్పష్టం చేశారు. వేల ఎకరాల భూస్వాములు ఉన్నప్పుడు అనుభవదారుల కాలమ్ పెట్టారు. అప్పటి పరిస్థితులకు అది కరెక్ట్. గ్రామాల్లో ఎంతో కష్టం వస్తే తప్ప భూమి అమ్ముకోరు. భూమి ఎవరికి కౌలుకు ఇవ్వాలనేది రైతు ఇష్టమని సీఎం అన్నారు. ఏ ప్రాపర్టీకి లేని అనుభవదారు కాలమ్.. రైతు భూమి ఎందుకు? అని ప్రశ్నించారు సీఎం. ప్రతి ఎకరం వివాదంలో ఉందని భావించడం సరికాదు. వివాదాస్పద భూములు కేవలం ఒక శాతం లోపే అని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. రెవెన్యూ సంస్కరణల్లో భాగంగా వీఆర్వో వ్యవస్థను రద్దు చేశామని.. కోవిడ్ ప్రభావం వల్ల రెవెన్యూ చట్టం ఆలస్యమైందన్నారు. పాత రెవెన్యూ చట్టంతో రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. పాత రెవెన్యూ చట్టంతో చాలా దారుణాలు చూశామని.. వీఆర్వోల విశేషాధికారాలతో చాలా మంది నష్టపోయారని కేసీఆర్ తెలిపారు. హైదరాబాద్ రాష్ట్రం ఉన్నప్పుడు సంప్రదాయాలు వేరు అని.. ఎన్టీఆర్ హయాంలో పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేశారన్న విషయాన్ని సీఎం ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రంలో 2.75 కోట్ల ఎకరాల భూమి ఉందన్నారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూమిగా వర్గీకరణ చేశారన్నారు. అసలు ఇప్పుడు తెలంగాణలో భూస్వాములే లేరని.. ఎస్సీ ,ఎస్టీ, బీసీల చేతుల్లోనే 90శాతం పైగా భూములు ఉన్నాయని కేసీఆర్ వ్యాఖ్యానించారు. 25 ఎకరాల పైబడి ఉన్న రైతులు కేవలం 6600 మంది మాత్రమేనని సీఎం చెప్పుకొచ్చారు. కొత్త రెవెన్యూ చట్టం సామాన్యుల కోసమేనని, కొందరు చట్టంపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. రైతుబంధు పథకం భూస్వాముల కోసం కాదు. రాష్ట్రంలో 25 ఎకరాలకు మించి ఉన్న రైతులు 0.11 శాతమే. వీఆర్వోల దుర్మార్గాల నుంచి విముక్తి కోసమే కొత్త రెవెన్యూ చట్టం. ఇకపై భూముల రిజిస్ట్రేషన్‌కు లంచం ఇవ్వాల్సిన అవసరం రాదు. వ్యవసాయ భూములకు సంబంధించి ధరణి పోర్టల్ పారదర్శకంగా పనిచేస్తుంది. ఎవరైనా, ఎప్పుడైనా ఓపెన్ చేసి చూసుకోవచ్చు. తహసీల్దార్లు కూడా ట్యాంపర్ చేయలేని విధంగా సాఫ్ట్‌వేర్ రూపొందించాం' అని కేసీఆర్ స్పష్టం చేశారు. ఏడాదిలోపే సమగ్ర భూసర్వే పూర్తి చేస్తాం. జిల్లాకో ఏజన్సీతో భూమిని సర్వే చేయిస్తాం. భూసర్వేకు అత్యాధునిక టెక్నాలజీ వాడుతాం. ఇంతపెద్ద మార్పు జరిగేటప్పుడు అభ్యంతరాలు సహజమే. భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం కావాలి. కావాలని గొడవలు పెట్టుకుంటే సివిల్ కోర్టులోనే తేల్చుకోవాలి. కొత్త రెవెన్యూ చట్టంతో భూవివాదాలు తగ్గుతాయి. కౌలుదారులను పట్టించుకోవాల్సిన అవసరం లేదు. రైతు తనకు నచ్చిన వ్యక్తికి భూమిని కౌలుకు ఇచ్చుకుంటాడు' అని కొత్త రెవెన్యూ బిల్లుపై మండలిలో కేసీఆర్ పై వ్యాఖ్యలు చేశారు. ఈ చర్చలో పల్లా రాజేశ్వరరెడ్డి, జీవన్ రెడ్డి, రామచంద్రరావు, సయ్యద్ జాఫ్రీ తదితరులు మాట్లాడారు.

దేశంలో ఆదర్శంగా నీరా పాలసీ

–ప్రభుత్వ భూముల్లో మొక్కలు పెంచుతాం: శ్రీనివాసగౌడ్

హైదరాబాద్,సెప్టెంబర్14(ఆర్ఎన్ఎ): గీత కార్మికుల సంక్షేమం కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో నీరా పాలసీని తీసుకొచ్చి గీత కార్మికులకు ఉపాధి కల్పించామని ఆయన చెప్పారు. ప్రతి జిల్లాలో నీరా కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. ప్రభుత్వ భూమి ఎక్కడున్నా చెట్లు పెంచడానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి శ్రీనివాస్‌గౌండ్ అన్నారు. శాసన మండలిలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. దేశంలో ఎక్కడాలేనివిధంగా నీరాపాలసీని తీసుకొచ్చామని చెప్పారు. ఇప్పటికే ట్యాంక్‌బండ్‌పై పైలట్‌ప్రాజెక్టు చేపట్టామన్నారు. అదేవిధంగా ప్రతి జిల్లా కేంద్రంలో నీరా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించిందని తెలిపారు. ప్రతి జిల్లాలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధిచేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు. పర్యాటకం ద్వారా రాష్ట్ర ఖ్యాతి పెరుగుతుందన్నారు. అదేవిధంగా యువతకు ఉపాధి సైతం పెరుగుతుందని చెప్పారు. జలాశయాలు, ఆలయాల టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రాష్ట్రంలో జలపాతాలను గుర్తించి అభివృద్ధిచేస్తామని చెప్పారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్నప్రభుత్వ భూముల్లో వనాలు పెంచుతామని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. తెలంగాణలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన వెల్లడించారు. తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సిఎం కెసిఆర్ నేతృత్వంలో తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

మెడికల్ కాలేజీల్లో అధ్యాపకుల వయోపరిమితి పెంపు

బిల్లును ప్రవేశ పెట్టిన మంత్రి హరీష్ రావు..సభ ఆమోదం

హైదరాబాద్,సెప్టెంబర్14(ఆర్ఎన్ఎ): మెడికల్ కాలేజీల్లో అధ్యాపకుల వయోపరిమితిని పెంచుతూ రూపొందించిన బిల్లును అసెంబ్లీ ఆమోదించింది. ఈ బిల్లును మంత్రి హరీశ్‌రావు అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. మెడికల్ కాలేజీల్లో నిపుణుల కొరత ఉన్నందువల్ల అధ్యాపకుల వయోపరిమితి పెంచుతున్నామని మంత్రి అన్నారు. దీనిద్వారా ఐదు మెడికల్ కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకుల వయోపరిమితిని 58 నుంచి 65 ఏండ్లకు పెంచుతున్నామని చెప్పారు. తద్వారా 52 మంది ప్రొఫెసర్లను కొనసాగించడానికి, అనుభవజ్ఞుల సేవలు వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. పదవీ విరమణ పొందుతున్నవారు ఎక్కువతుండటం, కోర్టు కేసులతో కొత్తవారిని నియమించుకునే అవకాశం లేకపోవడంతో వైద్య సేవలు, విద్యార్థులపై ప్రభావం పడకూడదనే ఉద్దేశంతో అధ్యాపకుల వయోపరమితి పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని వెల్లడించారు. మెడికల్ కాలేజీల్లో అధ్యాపకులు, వసతులపై ఏటా తనిఖీలు జరుగుతాయని, వీటి ఆధారంగానే వైద్య సీట్లు వస్తాయని చెప్పారు. అధ్యాపకులు లేక రాష్ట్రం వైద్య సీట్లు కోల్పోయే పరిస్థితి ఉండకూడదని చెప్పారు. సీట్లు కోల్పోతే రాష్ట్రానికి, విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. అందుకే విద్యార్థులపై ప్రభావం లేకుండా బోధనా సిబ్బంది వయోపరిమితి పెంచుతున్నామని చెప్పారు.

ప్రోస్టేట్ విస్తరించే వ్యాధితో తస్మాత్ జాగ్రత్త!

విశాఖపట్నం, సెప్టెంబర్ 14: వయస్సుపైబడుతున్న పురుష ప్రజానీకం అధికంగా ఉన్న దేశం ఇండియా అని, ఇక్కడ ప్రోస్టేట్ విస్తరించే వ్యాధితో అధిక శాతం మంది బాధపడుతున్నారని ఏఐఎన్‌యూ ఆసుపత్రి (వైజాగ్) యూరాలజిస్టు డాక్టర్ రవీంద్రవర్మ తెలిపారు. దీనివల్ల పగటిపూట కంటే రాత్రిపూట నిద్రలో తరచూ మూత్ర విసర్జనకు లేవడం పరిపాటిగా ఉంటుందన్నారు. మూత్ర విసర్జన చేసినా పూర్తి సంతృప్తి కలగదన్నారు. 40 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న 65 శాతం మంది పురుషులు ఈ చికాకు కలిగించే లక్షణాలతో బాధపడుతున్నారని ఓ పరిశోధన డేటా సూచించిందని పేర్కొన్నారు. ఈ వయస్సు గ్రూపులో ఉన్న పురుషులు టైప్ 2 మధుమేహం, అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్, శుక్లాలు లాంటి సుస్తీలతో ఇబ్బంది పడుతున్నారని వివరించారు. బినైన్ ప్రోస్టేటిక్ హైపర్ప్లాసియా లేదా బీపీహెచ్ అని పిలిచే ఈ వ్యాధి చాలావరకు వినని పేరన్నారు.

ఈ రోగులలో చాలామంది ఈ లక్షణాలు వయస్సు వల్ల వచ్చేవని భావించి ఊరికే ఉండిపోతారని తెలిపారు. ఈ విషయమై వారి తండ్రి, మామలు, పెద్దన్నయ్యలు, ఇతర పురుష మిత్రులు, బంధువులు, తెలిసిన వారిని ఉదాహరణగా చూపిస్తూ చల్లటి వాతావరణం, ఎక్కువగా నీళ్లు తాగడం, తదితర బాహ్య కారణాల వల్ల కలిగేవిగా చెప్తారన్నారు. ఈ లక్షణాలతో బాధపడేవారు నిశబ్దంగా ఉంటారని పేర్కొన్నారు. లక్షణాలు విషమించేదాకా, క్లిష్ట పరిస్థితులు తలెత్తే వరకూ అలానే ఉంటారని తెలిపారు. బీపీహెచ్‌తో బాధపడుతున్న రోగులు వారు వెళ్లిన ప్రదేశాల్లో వాష్‌రూమ్ కోసం ఎప్పుడూ వెతుకుతూ ఉంటారన్నారు. ఈ ప్రవర్తనను టాయిలెట్ మ్యాపింగ్ అంటారన్నారు. బయటకు వెళ్లినప్పుడల్లా మూత్ర విసర్జన చేయడం లేదా పడక వేయడం, ద్రవాలను తక్కువగా తీసుకోవడం, చివరకు బయటకు వెళ్లడం లేదా దూరపు ప్రయాణాలు అంటేనే హడలిపోయే పరిస్థితి ఉంటుందన్నారు.

చివరకు కాసేపు సరదగా కాలక్షేపం చేయడానికి కూడా భయపడిపోతారన్నారు. చాలా వరకూ అదుపు లేకుండా వారి లోపలి దుస్తుల్లో లీకు కావడం (వైద్యపరంగా దీనిని ఇన్‌కాంటినెన్స్ అని పిలుస్తారు) జరుగుతుందని తెలిపారు. మూత్ర విసర్జన చేయాలన్న తీవ్రమైన అతృతను వాయిదా వేసుకోవడం ఇలా జరుగుతుందన్నారు. దీనికి చికిత్స చేయకపోతే తీవ్రంగా మూత్రాన్ని ఆపుకోవడం (అకస్మాత్తుగా నొప్పిభరితంగా మూత్ర విసర్జన చేయలేకపోవడం) వల్ల మూత్ర సంబంధిత ఇన్ఫెక్షన్లు, రాళ్లు ఏర్పడటం, మూత్ర పిండాలు దెబ్బతినటం, వైఫల్యం చెందడానికి కూడా అవకాశం ఉందని తెలిపారు. చాలా సందర్భాల్లో ఈ సమస్యను శస్త్ర చికిత్స ద్వారా ఉపశమనం పొందలేకపోవచ్చన్నారు. జీవితాంతం కేథటెరైజేషన్ పై ఉండాల్సి రావడం లేదా చివరకు డయాలసిస్ చేయించుకోవాల్సిన అవసరం ఉంటుందన్నారు.

శారీరకం రేడియోగ్రాఫిక్ పరీక్షలు, కొన్ని లేబరేటరీ పరీక్షల సంయోగంతో బీపీహెచ్‌ని రోగ నిర్ధారణ పరీక్షలు చేయొచ్చున్నారు. శారీరక పరీక్షల్లో ఉండేది డిజిటల్ రెక్టాల్ పరీక్ష (డిఆర్ఈ), ఇది ప్రోస్టేట్ భౌతిక పరీక్షతో ముడిపడి ఉంటుందని తెలిపారు. స్పర్శ ద్వారా కనిపించే ప్రోస్టేట్ కేన్సర్ కోసం స్క్రీన్ చేయడం ముఖ్యమన్నారు. పొత్తి కడుపు, శ్రోణి అల్ట్రా సౌండ్ కూడా ప్రోస్టేట్ గ్రంథి సైజ్‌ను సూచిస్తాయని పేర్కొన్నారు. లేబరేటరీ పరీక్షల్లో ఉండేది ప్రోస్టేట్ స్పెసిఫిక్ యాంటిజెన్ (పీఎస్ఏ) అన్నారు. పీఎస్ఏ అనేది కేవలం ప్రోస్టేట్ ద్వారా తయారు చేయబడే ఒక ప్రోటీన్ అన్నారు. ప్రోస్టేట్ ఆరోగ్యంగా ఉన్నప్పుడు రక్తంలో చాలా కొద్ది పీఎస్ఏ కనిపిస్తోందన్నారు.

ఆరోగ్యకరమైన జీవనశైలి, ప్రవర్తన, ఖర్చు తక్కువ మందులను వాడడంతో, బీపీహెచ్‌ని అదుపులో ఉంచుకోవచ్చన్నారు. తదుపరి లక్షణాలను నియంత్రించలేకపోతే లేదా ఇన్‌ఫెక్షన్లు, రాళ్లు, మూత్ర పిండాలు దెబ్బతినడం మొదలైనవి వృద్ధి చెందితే శస్త్ర చికిత్స ద్వారా ప్రోస్టేటిక్ కణజాలాన్ని తొలగించడమే చివరకు చేయించుకోవాల్సిన చర్య అన్నారు. సురక్షితమైన ఔషధాలు, శస్త్ర చికిత్స మెళకవులు అందుబాటులో ఉన్నప్పుడు నిశబ్దంగా ఉండడం సరికాదన్నారు. ఈ సెప్టెంబర్ మనం ప్రోసేట్ ఆరోగ్య అవగాహన మాసోత్సవాన్ని పాటిస్తున్న సందర్భంగా.. పురుషుల ఆరోగ్యం గురించి అవగాహనను కల్పించడానికి ఒక అవకాశం తీసుకుందామని తెలిపారు. పురుషులు సామన్యంగా తమ ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తారని పేర్కొన్నారు. లిలిలి. లిష్టజీబిజీతీవత్రీతివట. తిని ఈ డిజిటల్ వేదిక ద్వారా తేలికగా ప్రోస్టేట్‌కు సంబంధించిన ఆరోగ్య సమాచారాన్ని అందజేయడం ఈనెల ఉద్దేశం అన్నారు. ల